తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
13-07-2026
మంగళవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 156
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్త పత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# ఉన్మాదానికి నిదర్శనం..
# వ్యవస్థల వైఫల్యం!



పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బి.రాజ్‌కుమార్ అనే వ్యక్తి బెయిల్‌పై బయటకు వచ్చిన వెంటనే కక్షతో ఊగిపోయాడు. తనపై ఫిర్యాదు చేసిన 17 ఏళ్ల మైనర్ బాలికను, ఆమె తల్లిని, నానమ్మను అత్యంత కిరాతకంగా హతమార్చాడు. అక్కడితో ఆగక, తన స్వంత భార్యను, 18 నెలలు, నాలుగేళ్ల వయసున్న ఇద్దరు అమాయక కుమారులను కూడా నిద్రలోనే గొంతుకోసి చంపేశాడు. ఒకే రాత్రి రెండు కుటుంబాలను నామరూపాలు లేకుండా చేసిన ఈ నరరూప రాక్షసుడి ఉన్మాదం యావత్ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. చివరకు ఈ కిరాతకుడు సోమవారం నాడు కొత్తూరు మండలం పెంజర్లలో పురుగుల మందు తాగి శవమై తేలడంతో ఈ నెత్తుటి అధ్యాయం ముగిసింది.

- **సమాజం పయనమెటు ?**
- కాటేస్తున్న కక్షలు.. కనుమరుగవుతున్న మానవత్వం
- షాబాద్ ఘటనపై ఇప్పటికైనా మేల్కొనేనా ?
- చట్టాల అమలులో నిర్లిప్తత..

**(తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్) :**

ఒక ఉన్మాది పగకు ఆరుగురు నిరపరాధులు బలైన విషాద వృత్తాంతం మాత్రమే కాదు, చట్టాల వైఫల్యానికి, వ్యవస్థల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం రంగారెడ్డి జిల్లా షాబాద్ ఘటన.. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బి.రాజ్‌కుమార్ అనే వ్యక్తి బెయిల్‌పై బయటకు వచ్చిన వెంటనే కక్షతో ఊగిపోయాడు. తనపై ఫిర్యాదు చేసిన 17 ఏళ్ల మైనర్ బాలికను, ఆమె తల్లిని, నానమ్మను అత్యంత కిరాతకంగా హతమార్చాడు. అక్కడితో ఆగక, తన స్వంత భార్యను, 18 నెలలు, నాలుగేళ్ల వయసున్న ఇద్దరు అమాయక కుమారులను కూడా నిద్రలోనే గొంతుకోసి చంపేశాడు. ఒకే రాత్రి రెండు కుటుంబాలను నామరూపాలు లేకుండా చేసిన ఈ నరరూప రాక్షసుడి ఉన్మాదం యావత్ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. చివరకు ఈ కిరాతకుడు సోమవారం నాడు కొత్తూరు మండలం పెంజర్లలో పురుగుల మందు తాగి శవమై తేలడంతో ఈ నెత్తుటి అధ్యాయం ముగిసింది.

**పోలీసుల నిర్లక్ష్యమా? లంచాల గుప్పిటా?**

ఈ ఘోరానికి పూర్తి బాధ్యత స్థానిక పోలీసులదేనని బాధితుల కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. తీవ్రమైన పోక్సో చట్టం కింద నమోదైన కేసులో కేవలం ఏడేళ్ల లోపు శిక్ష పడే సెక్షన్లను మాత్రమే చేర్చి, నిందితుడికి స్టేషన్ బెయిల్ లభించేలా చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. నిందితుడి నుంచి దాదాపు రూ.20 లక్షల లంచం తీసుకుని కేసును నీరుగార్చారనే సంచలన ఆరోపణలు కూడా వచ్చాయి. ఆలస్యంగా

మిగతా 3వ పేజీలో..

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- హైదరాబాద్ కు ఐఐఎం.. మెట్రో విస్తరణే లక్ష్యం
- ఐఐఎం సాధనలో బీజేపీ ఎంపీలు చొరవ చూపాలి
- ఏపీ నుంచి 'ఎన్ఓసీ'లు.. కేంద్రం రాయబారం కీలకం
- ఎంపీల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు



**హైదరాబాద్, జూలై 13 , సిరిన్యూస్:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించగలమని, రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర పార్లమెంట్ సభ్యుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో..

## స్వర్ణ పతక విజేత ప్రవల్లికకు సీఎం అభినందనలు

- ఏషియా అండర్-23 అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పరుగు పందెంలో..

2

## విద్యార్థుల్లో కుల వివక్షను దూరం చేస్తున్నాం

- యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి

2

## ఆరు నెలల గరిష్ఠానికి ద్రవ్యోల్బణం.. తెలంగాణలోనే అత్యధిక నమోదు

- జూన్‌లో 4.38 శాతానికి చేరిన రిటైల్ ద్రవ్యోల్బణం
- ఆర్బీఐ లక్ష్యాన్ని దాటిన 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు
- తెలంగాణలో 6.36 శాతం, ఏపీలో 5.39 శాతం నమోదు
- ఆహార పదార్థాలు, రవాణా, బంగారం ధరలతో పెరిగిన భారం

**న్యూఢిల్లీ, జూలై 13, సిరిన్యూస్**
దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుదల బాట పట్టింది. జూన్ నెలలో ద్రవ్యోల్బణం 4.38 శాతానికి చేరి గత ఆరు నెలల్లో అత్యధిక స్థాయిని నమోదు చేసింది. ఆహార పదార్థాలు, రవాణా సేవలు, బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన 4 శాతం లక్ష్యాన్ని దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సగానికి పైగా ప్రాంతాలు అధిగమించాయి.

**తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం**
రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే తెలంగాణలో అత్యధికంగా 6.36 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది. ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలో చెరో 5.39 శాతం నమోదవగా, తమిళనాడులో 5.24 శాతం, ఒడిశాలో

మిగతా 2వ పేజీలో..








## వైఐపీఎస్ నిర్మాణ పనుల్లో జాప్యాన్ని సహించను

- నిర్లక్ష్యం, ఆలస్యాన్ని సహించేది లేదు
- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- ఆదర్శ విద్యా సంస్థగా వైఐపీఎస్
- డీపీజీ ఆనంద్

2

## రాష్ట్రం వేడెక్కుతోంది..!

- మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 5 డిగ్రీలు అదనంగా నమోదు
- వర్షాకాలంలోనూ వేసవిని తలపిస్తున్న దారుణ పరిస్థితి
- ఎల్‌నినో ప్రభావంతో 20 రోజులుగా ముఖం చాటేసిన వర్షాలు
- సంక్షోభంలో పడ్డ వ్యవసాయ రంగం
- నీరు లేక ఎండిపోతున్న చెరువులు, రిజర్వాయర్లు

3





## సుప్రీం కోర్టు సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

- బనకచర్లపై పిటిషన్ అంతా తప్పులదడక
- గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు
- మరోమారు మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు

3

## షాబాద్ ఉన్మాది రాజ్‌కుమార్ ఆత్మహత్య!

- కొత్తూరు మండలం పంజర్లలో శవమై తేలిన నిందితుడు
- పోలీసులకు దొరకకుండా బలవన్మరణం

2






## ఎల్‌నినో ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం

- కలెక్టర్లు, వ్యవసాయాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశం

3

## కాళేశ్వరంపై కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు

గోదావరి నీరు వృథాగా సముద్రంలోకి
రైతులకు నీళ్లు ఇవ్వని రేవంత్ ప్రభుత్వం
నీరు విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం
ఎన్‌డీఎస్ఏ వంకతో కాళేశ్వరం నీరు ఎత్తిపోయడంలేదు
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3





# స్వర్ణ పతక విజేత ప్రవల్లికకు సీఎం అభినందనలు

హైదరాబాద్, జూలై 13, సిరిన్యూస్ :
చైనాలోని ఒర్డోస్‌లో జరుగుతున్న తొలి ఏషియా అండర్23 అథ్లెటిక్ చాంపియన్‌షిప్2026లో మహిళల 4I400 రిలే పరుగు పందెంలో స్వర్ణ పతకం సాధించిన ప్రవల్లిక నరిమళ్లకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ బిడ్డ ప్రవల్లిక ఆసియా23 అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌స్‌లో అసమాన ప్రతిభ కనబరిచి మహిళల 4I400 మీటర్ల రిలేలో ఆమె స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. నల్గొండలోని ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతూ డిండి గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొంది అంతర్జాతీయ వేదికపై రాణించిన ప్రవల్లిక యువ క్రీడాకారులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని ప్రశంసించారు. తాపీ మేస్త్రీ కూతురైన ప్రవల్లిక పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారన్నారు. ఈ జట్టులో ప్రవల్లిక, శ్రావణి సచిన్ సాంగ్లే, సాంద్రమోల్ సాబు, నోఫిసా ఖతూన్‌లతో కలిసి స్వర్ణ పతకం సాధించారు. ఈ నలుగురి బృందం 3:33.62 సెకన్ల సమయంతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని, ఆతిథ్య దేశమైన చైనాను అధిగమించింది. అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడానికి ముందే ప్రవల్లిక వివిధ వేదికల్లో 23 స్వర్ణాలు సహా మొత్తం 35 రాష్ట్రస్థాయి పతకాలను సాధించి అద్భుతమైన దేశీయ రికార్డును నెలకొల్పారు. ప్రవల్లికకు శిక్షణ అందించిన కోచ్‌లకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఈ చాంపియన్‌షిప్‌లో మొత్తంగా 3 స్వర్ణ, 4 రజత, 9 కాంస్య పతకాలతో 16 పతకాలను సాధించిన భారత క్రీడాకారులందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.



# విద్యార్థుల్లో కులవివక్షను దూరం చేస్తున్నాం

- యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి
- ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో సిఎం రేవంత్

హైదరాబాద్,జులై 13, సిరిన్యూస్:
జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు కీలక చర్యలు చేపట్టామని వెల్లడించారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం వ్యాఖ్యానించారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ స్కూల్లోనే అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న ప్రాంతంలో మొదటగా వీలైనన్ని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌స్‌ను పెంచుతున్నామని వివరించారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలను కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. రాజకీయాల్లో, ఇతర రంగాల్లో కీలక స్థానాల్లో ఎస్సీలకు అవకాశాలు కల్పించామని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.



# ఆరు నెలల గరిష్ఠానికి ద్రవ్యోల్బణం.. తెలంగాణలోనే అత్యధిక నమోదు

మొదటిపేజీ తరువాయి
5.15 శాతం, మధ్యప్రదేశ్‌లో 5.09 శాతం నమోదైంది. కర్ణాటక, ఉత్తరప్రదేశ్, కేరళ, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో కూడా ద్రవ్యోల్బణం ఆర్బీఐ లక్ష్యాన్ని మించింది. మరోవైపు మిజోరంలో అత్యల్పంగా 1.63 శాతం నమోదవగా, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ తదితర రాష్ట్రాల్లో కూడా ద్రవ్యోల్బణం తక్కువగానే నమోదైంది.

**ఆహార ధరలే ప్రధాన కారణం**
మే నెలలో 3.93 శాతంగా ఉన్న దేశ రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 4.38 శాతానికి పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం 4.78 శాతం నుంచి 5.32 శాతానికి చేరుకుంది. అల్లం, టమాటా, కిస్మిస్ వంటి ఆహార పదార్థాల ధరలు గణనీయంగా పెరిగాయి. అలాగే నగలు, సరుకు రవాణా, వ్యక్తిగత వాహనాల నిర్వహణ, హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార సేవల ధరలు కూడా పెరగడంతో వినియోగదారులపై అదనపు భారం పడింది.

**కొన్ని విభాగాల్లో ఉపశమనం**
కొన్ని వస్తువుల ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. వాహనాల కొనుగోలు ధరలు, గృహోపకరణాలు, వినోద వస్తువులు, పానీయాలు, సమాచార, కమ్యూనికేషన్ సేవల ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. అయితే బంగారం, వెండి ధరలు పెరుగుతూనే ఉండగా, వెండి ఆభరణాల ధరల్లో భారీ పెరుగుదల కనిపించింది. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో రానున్న నెలల్లో ధరల పరిస్థితిపై ఆర్థిక వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# వైఐపీఎస్ నిర్మాణ పనుల్లో జాప్యాన్ని సహించను

హైదరాబాద్, జూలై 13, సిరిన్యూస్:
రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) నిర్మాణ పనుల్లో జాప్యంపై డీజీపీ సి.వి.ఆనంద్ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ సొసైటీ అధ్యక్షుడు సి.వి. ఆనంద్‌అ ధ్యక్షతన సొసైటీ కమిటీ సమావేశం నిర్వహించారు.నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం, ఆలస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆయన కఠినంగా ఆదేశించారు. ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతతో పాటు వేగానికి కూడా అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని హెచ్చరించారు. దేశంలోనే తొలిసారిగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక విద్యాసంస్థలో పోలీస్ కుటుంబాల పిల్లలతో పాటు సాధారణ కుటుంబాల పిల్లలకు కూడా ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక మౌలిక వసతులు, ఆధునిక బోధనా విధానాలు, విలువలతో కూడిన విద్య, క్రీడలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత కల్పిస్తూ విద్యాబోధన కొనసాగుతోంది. సమావేశంలో పాఠశాల రెండో విద్యా సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఇప్పటివరకు సాధించిన పురోగతిపై డిజిపి సమగ్ర సమీక్ష నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సరంలో 345 మంది విద్యార్థులు నమోదు కాగా, 2026-27 విద్యా సంవత్సరానికి 360 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు అధికారులు వివరించారు. గత విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహించగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిని ప్రారంభించారు. ప్రస్తుతం నర్సరీ నుంచి ఆరో తరగతి వరకు బోధన కొనసాగుతున్న ఈ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరంలో మొత్తం 360 మంది విద్యార్థుల్లో



184 మంది పోలీస్ కుటుంబాలకు చెందినవారు, 176 మంది నాన్‌పోలీస్ కుటుంబాలకు చెందినవారు ఉన్నట్లు సమావేశంలో వెల్లడించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అందిస్తున్న నాణ్యమైన విద్యపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఇది నిదర్శనమని సభ్యులు అభిప్రాయపడ్డారు. పాఠశాల విస్తరణలో భాగంగా నూతనంగా 17 తరగతి గదులతో కూడిన నూతన అకాడమిక్ బ్లాక్ నిర్మాణ నమూనాను డిజిపికి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, సృజనాత్మకతను పెంపొందించేలా ప్రపంచ స్థాయి విద్యను అందించాలని అన్నారు. విద్యతో పాటు అత్యాధునిక మౌలిక వసతులు, సురక్షితమైన విద్యా వాతావరణం, ఆధునిక బోధనా పద్ధతులను కల్పించడంతో పాటు క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందడంతో పాటు మాదకద్రవ్యాలు వంటి సామాజిక దురలవాట్లకు దూరంగా ఉండే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పిల్లలు సురక్షిత వాతావరణంలో విద్యనభ్యసిస్తారనే నమ్మకం తల్లిదండ్రుల్లో ఉందని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని డీజీపీ అన్నారు.

పాఠశాల పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రొక్యూర్‌మెంట్ కమిటీ, అకాడమిక్ కమిటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిటీ, కోఆర్డినేషన్ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేశారు. విధివిధానాలను సమావేశంలో ఆమోదించారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా ఈ కమిటీలు పని చేయనున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు, విద్యా కార్యక్రమాలు, బోధనా విధానాలు, మౌలిక వసతులు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై స్కూల్ ప్రిన్సిపల్, సిబ్బంది పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సొసైటీ సభ్యులకు వివరించారు. నూతన అకాడమిక్ బ్లాక్ నిర్మాణాన్ని వేగవంతం చేసి, ప్రతి అంశంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని డిజిపి అధికారులకు సూచించారు. సమావేశంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, డీజీ(గ్రేహౌండ్స్ & ఆక్టోపస్) డాక్టర్ అనిల్ కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, ఐజీ (ప్రొవిజనింగ్ & లాజిస్టిక్స్) గజరావు భూపాల్, ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్ కుమార్, ఏఐజీ (లా & ఆర్డర్) రమణ కుమార్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రిన్సిపల్ అనితా రెడ్డి, సీఎస్ఆర్ కోఆర్డినేటర్ దీప్తి, జీఎం రాజేష్, విశాల్, సతీష్, సాక్షి, సొసైటీ సభ్యులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి
ఆయన పలు అంశాలపై ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌కు ఐఐఎంను తీసుకురావాలని, ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలని కోరారు. మెట్రో విస్తరణకు కేంద్ర సహకారం అవసరం అంటూ ఇందుకు సంబంధించి రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. భూసేకరణ ఒక కొలిక్కి వచ్చిందని, కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని ఆరఆరఆర్‌ను పూర్తి చేసుకోవాల్సి ఉందని చెప్పారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని ఎంపీలను ఆయన కోరారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్‌తో చర్చించామని, ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంవోసీ ఇవ్వాల్సి ఉందని, డిండి30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు90 టీఎంసీలకు ఎంవోసీ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఈ అంశం చర్చల దశలో ఉందని, ఈ విషయంలో కేంద్రం కూడా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చునన్నారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుందని, కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని తాము నిరభ్యంతరంగా చెబుతామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు తమకు ఎలాంటి భేషజాలు లేవన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు.

**మాకు ఎలాంటి భేషజాలు లేవు : ఉప ముఖ్యమంత్రి భట్టి**
ఎలాంటి భేషజాలు లేకుండా, కేవలం రాష్ట్ర ప్రయోజనాలే ఏకైక లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన వాటాలను, నిధులను సాధ్యమైనంత వరకు సాధించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎంపీలు అందించిన ప్రతి సలహాను, సూచనను ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు నోట్ చేసుకున్నారని, వాటన్నింటినీ సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయిలో అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ కార్యదర్శితోపాటు సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వానికి వివిధ శాఖల కార్యదర్శులు, మంత్రులు, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం రాసే ప్రతీ లేఖ ప్రతులను తప్పనిసరిగా తెలంగాణ భవన్ స్పెషల్ సెక్రటరీకి పంపాలని చెప్పారు. గతంలో పంపిన లేఖలు, భవిష్యత్తులో పంపే ఉత్తరాలు, పెండింగ్ అంశాలన్నింటినీ శాఖల వారీగా క్రోడీకరించి ఒక స్పష్టమైన డ్రాఫ్ట్ తయారు చేయాలని ఆదేశించారు. ఈ డ్రాఫ్ట్‌ను పార్లమెంట్ సమావేశాల సమయంలో ఎంపీలకు అందజేస్తారని, తద్వారా ఎంపీలు ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలిసినప్పుడు రాష్ట్ర ప్రయోజనాలను వివరించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో ఎంపీలకు తక్షణ సమాచారం, సహకారం అందించేందుకు తెలంగాణ భవన్‌లో ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక టీమ్‌ను అందుబాటులో ఉంచుతుందని ప్రకటించారు. క్వశ్చన్ అవర్‌లో సప్లిమెంటరీ ప్రశ్నలు అడగడానికి అవసరమైన డేటాను ఈ టీమ్ అందిస్తుందన్నారు.

**ప్రజాస్వామ్య విలువలను బలంగా నమ్ముతాం**
కేంద్రం, రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీల ప్రభుత్వాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో 'ఫెడరల్ స్పిరిట' (సమాఖ్య స్ఫూర్తి), ప్రజాస్వామ్య విలువలను తాము బలంగా నమ్ముతామని డిప్యూటీ సీఎం అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసిన ప్రతి సందర్భంలోనూ ఒక పార్టీ తరఫున కాకుండా రాష్ట్ర ప్రభుత్వంగానే వెళ్తున్నామని ప్రకటించారు. రాష్ట్ర ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని, ప్రజాప్రభుత్వంలో భాగమైనా తాము రాజకీయాలు చేయడం లేదని చెప్పారు. వివిధ కార్యక్రమాల వల్ల సమావేశానికి రాలేకపోయిన ఇతర ఎంపీలను కూడా కలిసి ఈ సమన్వయ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని అధికారులను ఆయన కోరారు. భవిష్యత్తులో పార్లమెంట్ నోటిఫికేషన్ రాగానే ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేస్తామని, తద్వారా క్వశ్చన్ అవర్ కంటే ముందే ప్రశ్నలు పంపుకోవడానికి వీలవుతుందని డిప్యూటీ సీఎం చెప్పారు. ప్రస్తుత సమావేశాల నేపథ్యంలో క్వశ్చన్ అవర్, జీరో అవర్, స్టాండింగ్ కమిటీలు, కన్సల్టేటివ్ కమిటీల వంటివి అందుబాటులో ఉన్న ప్రతి ఫార్మాట్‌ను ఉపయోగించుకొని కేంద్రం దృష్టికి రాష్ట్ర అంశాలను తీసుకెళ్లాలని ఎంపీలను డిప్యూటీ సీఎం కోరారు. దీనితోపాటు అందరూ కలిసి డెలిగేషన్ లాగా వెళ్లి కేంద్ర మంత్రులను కలిస్తే దానికి ప్రాముఖ్యత ఉంటుందని, మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరిగే సమయంలో ముఖ్యమంత్రి గానీ, తాను గానీ స్వయంగా ఢిల్లీకి వస్తామని ప్రకటించారు. అక్కడ ఎంపీలతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఏయే అంశాలపై ఒత్తిడి తేవాలనే దానిపై చర్చిస్తామన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను ఎలాంటి వేలం లేకుండా సింగరేణికే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిప్యూటీ సీఎం కోరారు. గతంలో ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించిన సత్తుపల్లి, కోయగూడెం3 బ్లాకులను తిరిగి సింగరేణికి కేటాయించేలా ఈ సమావేశాల్లో ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్రంలోని అతిపెద్ద ప్రభుతరంగ సంస్థ అయిన సింగరేణిని బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హైదరాబాద్‌కు సెమీకండక్టర్ వంటి భారీ ప్రాజెక్టు రావడం అనేది ఒక పెద్ద 'గేమ్ ఛేంజర' అవుతుందని భట్టి అభిప్రాయపడ్డారు. భవిష్యత్ అంతా సాంకేతికతపైనే ఆధారపడి ఉన్నందున, సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. జీఎస్టీ వచ్చినప్పటి నుంచి పన్నులన్నీ రాష్ట్రం నుంచి కలెక్ట్ అయి సెంట్రల్ పూల్‌కి వెళ్తున్నాయని, అక్కడినుంచే పంపిణీ జరుగుతోందని చెప్పారు. కాబట్టి కేంద్రం దగ్గరకు వెళ్లి రాష్ట్ర వాటాను మనం తెచ్చుకోవడం మినహా వేరే మార్గం లేదుని ఎంపీలతో భట్టి విక్రమార్క చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల క్లియరెన్సులకు సంబంధించిన పూర్తి డీటెయిల్డ్ ఇన్ఫర్మేషన్‌ను ఎంపీలకు అందిస్తామని చెప్పారు. అవసరమైతే రాష్ట్ర ఇరిగేషన్ మంత్రితో కలిసి అందరూ కేంద్రానికి రిప్రజెంట్ చేయాలని కోరారు. రైల్వే నెట్‌వర్క్ విస్తరణ వల్ల రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందించాల్సిన భూసేకరణ లేదా ఇతర సహకారాలను వంద శాతం అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# షాబాద్ ఉన్మాది రాజ్‌కుమార్ ఆత్మహత్య!

షాబాద్/హైదరాబాద్, జూలై 13, సిరిన్యూస్ :
రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ముగ్గురు ¾పిల్లలు సహా ఆరుగురిని కిరాతకంగా గొంతు కోసి హత్య చేసిన నరరూప రాక్షసుడు రాజ్‌కుమార్ కథ విషాదాంతమైంది. పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న ఈ ఉన్మాది చివరకు తన మేనమామ ఊరైన కొత్తూరు మండలం పంజర్లలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ లభ్యమైనట్లు తెలుస్తోంది. తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రగిలిపోయిన రాజ్‌కుమార్ ఈనెల 10న అర్ధరాత్రి మూడు వేర్వేరు ప్రాంతాల్లో అత్యంత దారుణంగా ఆరుగురిని అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. మొదట షాబాద్ టౌన్‌లో మైనర్ బాలిక తల్లి, నాయనమ్మలను నరికి చంపాడు. ఆపై ఆ బాలికను అఖిల్ సాగర్ చెరువు వద్దకు తీసుకెళ్లి గొంతుకోశాడు. అంతటితో ఆగకుండా తన ఇంటికి వెళ్లి భార్య, ఇద్దరు కొడుకులను సైతం కిరాతకంగా బలిగొన్నాడు. ఈ ఘోర ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

**12 బృందాల గాలింపు.. రివార్డు ప్రకటన**
ఈ దారుణ ఉదంతాన్ని సవాల్‌గా తీసుకున్న పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు తెలంగాణ, కర్ణాటక సరిహద్దుల్లో 12 ప్రత్యేక బృందాలతో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిపై లుకౌట్ నోటీసులు జారీ చేయడమే కాక రూ.2 లక్షల రివార్డును కూడా ప్రకటించారు.



**ఆత్మహత్య డ్రామా.. చివరకు శవమై తేలి..**
ఆరుగురిని చంపిన తర్వాత 'నేను కూడా చనిపోతున్నా' అని రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేసినట్లు సమాచారం. మొదట తిమ్మాపూర్ రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్య డ్రామా ఆడి పోలీసులను తప్పుదోవ పట్టించి తప్పించుకున్నాడు. కానీ చివరకు పంజర్లలో శవమై తేలాడు. దీంతో కేసు కీలక మలుపు తిరిగింది.

**బాలికను నమ్ముకుని అప్పులపాలయ్యా..**

**సెల్ఫీ వీడియోలో రాజకుమార్**
రంగారెడ్డి : షాబాద్‌లో ఆరు హత్యలకు ముందు రోజు హంతకుడు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడని ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. అతని మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియోను గుర్తించినట్లు పేర్కొన్నారు. వీడియో రికార్డు వివరాల ఆధారంగా హత్యకాండకు ముందురోజు అంటే జులై 10న వీడియో రికార్డు చేసినట్లు గుర్తించామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలను సీపీ తరుణ్ జోషీ మీడియాకు వెల్లడించారు. తాను అప్పులపాలయ్యానని, జీవితం మీద విరక్తి చెందినట్లు నిందితుడు ఈ వీడియోలో ఉందని అన్నారు. తన సంపాదనలో సగం వాళ్లకే పెట్టానని, తన దగ్గర డబ్బు వసూలు చేసి నష్టపరిచారని తెలిపాడన్నారు. తన పిల్లలకు భూమి లేకుండా చేసుకున్నానని. ఆ అమ్మాయిని నమ్మి అప్పుల పాలయ్యానని, చివరకు కేసు పెట్టి జైలుకు పంపాలని చూస్తున్నారని రాజ్‌కుమార్ వీడియో రికార్డ్ చేశాడని సీపీ వెల్లడించారు. 11 నుంచి 12 గంటల మధ్యలో ఆరు హత్యలు జరిగాయని సీపీ తరుణ్ జోషి చెప్పారు. రాజ్‌కుమార్ రూ.2 వేలకు కారు అద్దెకు తీసుకున్నాడని, ఘటన జరిగిన రోజు పదిన్నర గంటలకు ఊర్లోకి వచ్చాడని, అమ్మాయిని తీసుకుని దేవరకొండకు వెళ్లాడని చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు అలవాటు ఉండటంతో నిందితుడు 16 సిమ్ కార్డులు వాడాడని చెప్పారు. నిందితుడికి రూ.2 కోట్లకు పైగా అప్పు ఉందని, దానివల్ల మానసిక పరిస్థితి స్థిమితంగా లేదని చెప్పారు. కాలేజీ నుంచి వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు ఆ బాలికను వేధించాడన్నారు. అతనిపై పోక్సో కేసు ఉందని, తాజాగా ముందస్తు బెయిల్ వచ్చిందని వెల్లడించారు. షాబాద్‌లో బాలిక నానమ్మను చంపి అక్కడ నుంచి ఆమెను తీసుకుని దైవాలగూడ వెళ్లాడని సీపీ తరుణ్ జోషీ తెలిపారు. అక్కడ బాలిక, తన భార్యను, పిల్లలను నిందితుడు చంపేశాడని వెల్లడించారు. 11:37 గంటలకు తన తండ్రికి ఫోన్ చేసి ఆరుగురిని చంపేశానని, తాను ఆత్మహత్య చేసుకుంటానని రాజ్‌కుమార్ చెప్పాడని తెలిపారు. ఒంటిగంటకు హంతకుడి తండ్రి పోలీసులకు సమాచారం ఇచ్చారని చెప్పారు. ఈ ఘటన తర్వాత బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ తర్వాత నిందితుడిని పట్టుకునేందుకు పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని, జీపీఎస్ ఆధారంగా రాజ్‌కుమార్‌ని పట్టుకునేందుకు యత్నించామని వివరించారు. క్లూస్ టీం సభ్యులు మృతదేహం లభించిన ప్రాంతాన్ని పరిశీలించారన్నారు. ఎన్నిగంటలకు రాజ్‌కుమార్ చనిపోయాడనేది క్లారిటీ లేదని తెలిపారు. పెంజర్లలో రాజ్‌కుమార్ మేనమామ ఉన్నారని తెలిపారు. నిందితుడికి సంబంధించిన నాలుగు కుటుంబాలు ఈ గ్రామంలోనే ఉంటున్నాయని సీపీ తరుణ్ జోషీ పేర్కొన్నారు.

# ఎల్-నినో ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం

- రైతులు నష్టపోకుండా మూడు దశల ముందస్తు కార్యాచరణ
- ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో మంత్రి తుమ్మల సమీక్ష
- కలెక్టర్లు, వ్యవసాయాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశం

**హైదరాబాద్, జులై 13, సిరిన్యూస్:**

ప్రస్తుత ఎల్‌నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ ఇక్రిశాట్‌లో భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్, సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సోమవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు. ముందుగా వివిధ సంస్థల శాస్త్రవేత్తలు ఎల్‌నినో పరిస్థితులను తట్టుకునేలా తాము సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం, మధ్యలో దీర్ఘకాలిక పొడి పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఈనెల 15, 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈనెల 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగస్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసి ముందుగానే అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇరిగేషన్, భూగర్భజల శాఖ, మిగతా శాఖల అధికారులు నీటి లభ్యత వివరాలు, విద్యుత్ సరఫరాకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను మంత్రికి వివరించారు. అన్ని జిల్లాల వర్షపాతం పరిస్థితులను ప్రభుత్వం రోజువారీగా సమీక్షించాలని ఆదేశించారు. 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా 20 జిల్లాల్లో లోటు ఉందన్నారు. వర్షాభావ జిల్లాల్లో కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. శాస్త్రీయ విధానాలతో ఎల్‌నినోను ఎదుర్కోవాలని, దీనికి సంబంధించి డైనమిక్ డిస్ట్రిక్ట్ స్పెసిఫిక్ రెస్పాన్స్ (డీఎసఆర్) విధానాన్ని అమలు చేయాలని మంత్రి సూచించారు.

**మండలాల వారీగా వారపు బులెటిన్**

ఎల్‌నినోను ఎదుర్కోవాలంటే వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని మంత్రి తుమ్మల అన్నారు. భారత వాతావరణ శాఖ(ఐఎండీ), నీటిపారుదల, భూగర్భ జ□, విద్యుత్, వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయంతో ప్రతి వారం మండలాల వారీగా సమగ్ర వ్యవసాయవాతావరణ బులెటిన్ విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు ఆఖరు వరకు ప్రతీ వారం విడుదల చేసే ఈ బులెటిన్‌లో మండలాల వారీగా నమోదైన వర్షపాతం, రాబోయే వారానికి, నెలాఖరు వరకు ఉండే వాతావరణ పరిస్థితుల అంచనాలు, డ్రై స్పెల్స్ ఏర్పడే అవకాశాలు, గరిష్ఠకనిష్ఠ ఉష్ణోగ్రతలు, నేల తేమ పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత, సాగునీటి పరిస్థితి, విద్యుత్ సరఫరా, పంటల స్థితి, రైతులు చేపట్టాల్సిన యాజమాన్య చర్యలతోపాటు నీటిపారుదల శాఖ ప్రాజెక్టుల క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో ఈ నెల, వచ్చే నెలకు సంబంధించిన వాతావరణ అంచనాలను విశ్లేషించి, ఆయా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉండే నీటి నిల్వలు, ఇన్‌ఫ్లోలు, సాగునీటి లభ్యతపై ఖచ్చితమైన అంచనాలను కూడా బులెటిన్‌లో పొందుపరచాలని మంత్రి స్పష్టం చేశారు.

**శాస్త్రవేత్తల సూచనలు**

వర్షపాతం నమోదై భూమిలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో (బీబీఎఫ్) లేదా రిడ్జ్ అండ్ ఫరో పద్ధతులను అనుసరించాలని, భూమిలో తేమ ఏర్పడే వరకు ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని, నేల తేమను కాపాడేందుకు తరచూ ఇంటర్ కల్టివేషన్ చేపట్టాలని, వర్షాలు కురిసిన తర్వాత మాత్రమే సిఫార్సు చేసిన మోతాదులో నత్రజని, పొటాష్ ఎరువులు వేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. పంటల కీలక ఎదుగుదల దశల్లో ప్రాణాధార నీటిపారుదల అందించడం, వరుస పంటల్లో స్కిప్ రో ఇరిగేషన్ అమలు చేయడం, దీర్ఘకాలిక పొడి పరిస్థితుల్లో 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయడం, ప్రతి 3.6 మీటర్లకు ఒక డెడ్ ఫరో ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించడం, వ్యవసాయ కుంటల్లో నిల్వ చేసిన నీటిని అవసరమైన సమయంలో వినియోగించడం, అంతర పంటలను ప్రోత్సహించడం, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారని మంత్రి తెలిపారు.

**వరి రైతులకు ప్రత్యేక సూచనలు**

ప్రస్తుతం వరి పంట నారుమడి దశలో ఉన్న రైతులు నారు పీకడానికి వారం రోజుల ముందు ఎకరానికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3సీజీ గ్రాన్యూల్స్ వేయాలని, నాటే సమయంలో నారు ఆకుల చివరలను కత్తిరించి నాటాలని, 15/10 సెంటీమీటర్ల దూరంతో దగ్గరగా నాటి ప్రతి గుంతలో 68 మొక్కలు ఉంచాలని, సిఫార్సు చేసిన మోతాదుతో పోలిస్తే 25 శాతం అదనపు నత్రజని ఇవ్వాలని, మొత్తం నత్రజనిలో 70 శాతం నాటే సమయంలో, మిగిలిన 30 శాతం పూత ప్రారంభ దశలో వేయాలని మంత్రి అన్నారు. నీటి పొదుపు కోసం ఆల్టర్నేటివ్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ (ఏడబ్ల్యూడీ) పద్ధతిని అమలు చేయాలన్నారు. నారు వేయని రైతులు తక్కువ కాలంలో పండే రకాలతో డ్రై డైరెక్ట్ సీడెడ్ రైస్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కాల్వల ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యతను బట్టి వరికి బదులు మొక్కజొన్న, సజ్జలు, రాగులు, కందులు, మినుములు, పొద్దుతిరుగుడు, నువ్వులు, అలసందలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. మొక్కజొన్న, పత్తి పంటలు ప్రస్తుతం మొలక దశలో ఉన్నందున రాబోయే రెండు వారాల్లో వర్షాభావ పరిస్థితులు కొనసాగితే నేల తేమను కాపాడేందుకు కలుపు నియంత్రణ చర్యలు రైతులకు సూచించాలని మంత్రి తెలిపారు.

**విత్తనాల, ఎరువుల కొరత ఉండదు**

అవసరమైన విత్తనాలు, ఎరువులపై ఇప్పటికే సమగ్ర అంచనా వే□శామని మంత్రి తెలిపారు. మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలకు అనుగుణంగా అవసరమైన విత్తనాలను ముందుగానే సమీకరించామని, మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ రైతులకు కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, ఇక్రిశాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, కమిషనర్ కోఆపరేషన్ రాహుల్ రాజ్, హాకా ఎండీ చంద్రశేఖర్, గిడ్డంగుల శాఖ ఎండీ లక్ష్మి, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్, అగ్రి, హార్టికల్చర్ యూనివర్సిటీల వీసీలు జానయ్య, రాజిరెడ్డి, ఇక్రిశాట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ హరికిషన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు

- గోదావరి నీరు వృథాగా సముద్రంలోకి
- రైతులకు నీళ్లు ఇవ్వని రేవంత్ ప్రభుత్వం
- నీరు విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం
- ఎన్‌డీఎస్ ఏ వంకతో కాళేశ్వరం నీరు ఎత్తిపోయడంలేదు
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**కరీంనగర్, జులై 13 సిరిన్యూస్:**

తన అబద్ధాలు బయటపడతాయన్న ఏకైక కారణంతోనే ఒకవైపు గోదావరిలో నీరు భారీగా కిందికి వృథాగా పోతుంటే మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతన్నల గొంతు ఎండబెడుతూ, పంట పొలాలను ఎండబెడుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కరీంనగర్ జిల్లాలోని మిడ్ మానేరు ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం పనికిరాదు అంటూ మాట్లాడిన రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలు. రిటైర్డ్ ఇంజనీర్లు. ఇరిగేషన్ నిపుణులు చేస్తున్న సూచనలు జీర్ణించుకోలేక వారిపై తిట్ల దండకం అందుకున్నారన్నారు. గత ప్రభుత్వంపైన, కాళేశ్వరం ప్రాజెక్టు పై గుడ్డి ద్వేషంతో నీళ్లు ఎత్తిపోయడం లేదన్నారు. ఇప్పటికైనా నీటిని ఎత్తిపోయకుంటే ప్రజలు కాంగ్రెస్‌ని తన్ని తరుముతారు అన్నారు. వెంటనే రైతన్నలు డిమాండ్ చేస్తున్న మేరకు కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ రాకముందు వరకు నిండుకుండలా ఉండేదని, కాంగ్రెస్ రాగానే మిడ్ మానేరు ఎండిపోతున్నది అన్నారు. కరువు ముంగిట నిలబడ్డ తెలంగాణకు కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోస్తే రైతన్నలకు ప్రజలకు సాగు, తాగునీటి సంక్షోభం లేకుండా చేయవచ్చు అన్నారు. రైతుల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి రాజకీయ కక్షసాధింపే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకొని వెంటనే కాళేశ్వరం ద్వారా నీటిని ఎత్తిపోసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోతే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. గోదావరిలో వరద లేదని ముఖ్యమంత్రి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అబద్ధాలు చెబుతున్నారని, వాస్తవానికి టీఎంసీల కొద్దీ నీరు కిందికి పోతుండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అదే నీటిని ఎత్తిపోసుకుంటోందని కేటీఆర్ పేర్కొన్నారు. పక్క రాష్ట్ర ప్రయోజనాల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కావాలనే తెలంగాణ రైతులకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. మేడిగడ్డ వద్ద లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నప్పటికీ మేడిగడ్డ గేట్లు దించకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా దాదాపు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ అవకాశం వినియోగించుకోవడం లేదన్నారు. ఈ విషయాలన్నీ తెలిసినా కేవలం బీజేపీ ఇచ్చిన అక్రమ ఎన్డీఎస్ఏ నివేదికను సాకుగా చూపిస్తూ పంటలను ఎండబెడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం నీటిని ఎత్తిపోసే విషయంలో కాంగ్రెస్ , బిజెపి కలిసి నాటకాలు ఆడుతున్నాయన్నారు. ఇప్పటికే తగిన మరమ్మతులు పూర్తి అయ్యాయని సాగునీటి శాఖ మంత్రి ఒకవైపు చెబుతున్నా మరోవైపు ఎన్ డిఎస్ ఏ రిపోర్ట్ పేరుతో అబద్ధాలు ఆడుతున్నారన్నారు. అది ముమ్మాటికి రాజకీయంగా రాసిన అబద్ధాల రిపోర్ట్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయకపోవడం వల్ల లోయర్ మానేరు, మిడ్ మానేరు మాత్రమే కాక మొత్తం గోదావరి బేసిన్‌కు చెందిన అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తీవ్రమైన వ్యవసాయ సంక్షోభంతో పాటు తాగునీటి సంక్షోభం కూడా తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎల్లంపల్లి నుంచి కూడా నీటిని ఎత్తిపోసే ప్రక్రియ నిలిచిపోవడంతో చివరికి హైదరాబాద్ నగరానికే తాగునీటి సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉందని కేటీఆర్ అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం నుంచి లోయర్ మానేరు ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోయడం వల్ల కరీంనగర్ నగరానికి రోజూ తాగునీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం కరీంనగర్ ప్రజలు తాగునీటి కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రిటైర్డ్ ఇంజనీర్లపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కేటీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేకుండానే తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని సాగునీటి హక్కుల కోసం పోరాడిన సీనియర్ ఇంజనీర్లను అవమానించడం దురదృష్టకరమన్నారు. న్యాయమైన జలహక్కుల కోసం పోరాడిన వారి సేవలను ప్రజలు గుర్తుంచుకుంటారని చెప్పారు. 'కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తిపోసాలంటే మా రక్తం కావాలి' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించిన నేపథ్యంలో 'మా రక్తం కావాలంటే తీసుకోండి.. కానీ రైతన్నలకు నీళ్లు ఇవ్వండి' అనే సందేశంతో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ప్రశాంత్ రెడ్డితోపాటు పార్టీ విద్యార్థి, యువజన విభాగాల కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున రక్తదానం చేసి ముఖ్యమంత్రికి పంపించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల విషయంలో కూడా బీజేపీ ఇచ్చిన అక్రమ ఎన్డీఎస్ఏ నివేదికను ప్రభుత్వం సాకుగా చూపిస్తూ రైతులకు నీళ్లు ఇవ్వకుండా అడ్డుకుంటోందని ఆరోపించారు. 28.5 లక్షల క్యూసెక్కుల భారీ వరద ప్రవాహాన్ని తట్టుకున్న మేడిగడ్డతోపాటు ఇతర బ్యారేజీలు లక్ష క్యూసెక్కుల నీటిని కూడా తట్టుకోలేవని చెప్పడం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాజకీయాలను పక్కనబెట్టి ప్రభుత్వం వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఉన్మాదానికి నిదర్శనం.. వ్యవస్థల వైఫల్యం !

మొదటిపేజీ తరవాయి

నైనా స్పందించిన ఉన్నతాధికారులు షాబాద్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేసినప్పటికీ, పోయిన ఆరుగురి ప్రాణాలను ఎవరు తిరిగి తెస్తారనేదే ఇక్కడి అసలు ప్రశ్న.

**చట్టాలు ఉన్నాయి.. రక్షణ ఏది?**

మహిళలు, మైనర్ల రక్షణ కోసం ఎన్నో కఠినమైన చట్టాలు తెచ్చినట్లు పాలకులు చెప్తున్నా, క్షేత్రస్థాయిలో బాధితులకు భద్రత కరువైందని ఈ ఘటన నిరూపించింది. పోక్సో కేసు నమోదు చేసిన తర్వాత బాధితులకు ఎలాంటి పోలీసు రక్షణ కల్పించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. బెయిల్‌పై వచ్చిన నిందితుడి కదలికలను కనిపెట్టడంలో, అతని మానసిక స్థితిని అంచనా వేయడంలో ఇంటెలిజెన్స్ విఫలమైంది. చట్టాల్లోని లొసుగులను వాడుకుని నేరగాళ్లు తప్పించుకోకుండా, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలి.

**విలువల పతనం...**

ఇలాంటి అమానవీయ ఘటనలు కేవలం షాబాద్‌కే పరిమితం కావడం లేదు. ఈ మధ్యకాలంలో రాష్ట్రవ్యాప్తంగా కక్షలు, క్షణికావేశాలు, సోషల్ మీడియా వికృత పోకడలు, వేధింపుల కారణంగా ఎందరో మహిళలు, చిన్నారులు బలవుతున్నారు. చట్టాలు ఎంత కఠినంగా మారుతున్నా, ఉన్మాదులలో భయం చావకపోవడానికి కారణం క్షేత్రస్థాయిలో నిఘా లోపించడమే. వేధింపులకు గురవుతున్న బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే కౌన్సిలింగ్‌లు, నామమాత్రపు కేసులతో సరిపెట్టకుండా నిందితుల కదలికలపై నిఘా ఉంచాలి. చుట్టుపక్కల జరుగుతున్న దారుణాలను చూస్తూ కూడా మౌనంగా ఉండటం నేరస్తులకు మరింత బలాన్ని ఇస్తుంది. నిర్లక్ష్యం వహించిన అధికారులపై కేవలం సస్పెన్షన్‌తో సరిపెట్టకుండా, పౌరుల ప్రాణాలకు భద్రత కల్పించే పటిష్ఠ కార్యాచరణ చేపట్టాలి. పసిపిల్లల గొంతులు కోసే సమాజంలో మనం బతుకుతున్నామా? అనే ప్రశ్న ప్రతి ఒక్కరినీ వేధించక మానదు. ఇప్పటికైనా చట్టాలు, రక్షణ వ్యవస్థలు, సమాజం కలిసికట్టుగా మేల్కొకపోతే.. షాబాద్ లాంటి మారణకాండలు పునరావృతమవుతూనే ఉంటాయి, మానవత్వం మంటగలుస్తూనే ఉంటుంది.



# రాష్ట్రం వేడెక్కుతోంది..!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. జులై మాసం వర్షాకాలం మిడిసిపడాల్సిన సమయంలో.. దానికి భిన్నంగా భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో తెలంగాణ అంతటా వేసవిని తలపించే పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఏకంగా 5 డిగ్రీల మేర అదనపు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉక్కపోతతో విలవిలలాడిపోతున్నారు. కొన్నేళ్ల తర్వాత మొదటిసారి వర్షాకాలంలో ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరగడం పర్యావరణవేత్తలను సైతం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. అంతర్జాతీయంగా ఏర్పడిన ఎల్‌నినో ప్రభావం వల్ల రుతుపవనాలు ముఖం చాటేయడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి కవల సమస్యలు ఇప్పుడు తెలంగాణను ఇబ్బందుల పాలు చేయనున్నాయి.

**సంక్షోభంలో వ్యవసాయం..**

మొన్నటి వరకు విపరీతమైన ఈదురు గాలుల మూలంగా తెలంగాణ రైతాంగానికి వరి నారు మళ్లలో నీళ్లు నిలవక తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. ఇందుకు తోడు గత 20 రోజులుగా రాష్ట్రంలో ఎక్కడా ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో, ఇప్పటికే లక్షల ఎకరాల్లో వేసిన వివిధ పంటల పరిస్థితి పూర్తిగా ప్రశ్నార్థకమవుతోంది. దీనికి తోడు సహజసిద్ధమైన చెరువులు, కుంటలతో పాటు మేజర్ రిజర్వాయర్లలో సైతం నీటి నిల్వలు అడుగంటిపోతుండటం భయాందోళనలు కలిగిస్తోంది. ఒకవైపు వేసిన పంటలు చేతికి వస్తాయో లేదోనని అన్నదాతలు దిగాలు చెందుతుంటే.. మరోవైపు భూగర్భ జలాలు పాతాళానికి పడిపోవడంతో పల్లెల్లో సైతం బోరుబావులు ఎత్తిపోతున్నాయి. ఈ ఎండల తీవ్రత ఇలాగే కొనసాగితే గ్రామాల్లో తాగునీటి కరవు మరింత జటిలం కానుంది.

**పట్టణాలు ఆగమాగం..**

మరోవైపు తెలంగాణవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో నీటి కోసం గత నెల రోజులుగా ప్రజలు అల్లాడిపోతున్నారు. భూగర్భ జలాలు క్రమంగా క్షీణించడంతో ప్రైవేట్, మున్సిపల్ వాటర్ ట్యాంకర్లపైనే జనం ఎక్కువగా ఆధారపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందంటే.. ఆన్‌లైన్ లేదా మున్సిపాలిటీల్లో వాటర్ ట్యాంకర్ బుక్ చేస్తే కనీసం 5 రోజుల వరకు కూడా సరఫరా కావడం లేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల బావులు, బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్ల నిర్వాహకులు కూడా నీటిని తెచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**హైదరాబాద్‌కు నీటి ఇక్కట్లు!**

భాగ్యనగరానికి తాగునీరు అందించే ప్రధాన వనరుల్లో ఒకటైన సింగూర్ రిజర్వాయర్‌లో ఇప్పటికే మరమ్మతుల నిమిత్తం నీటిని దిగువకు వదలడం, ఈ వర్షాకాలంలో ఆశించిన రీతిలో కొత్త నీరు వచ్చి చేరకపోవడం తాగునీటి సమస్యకు ప్రధాన కారణంగా మారుతోంది. ఒకవైపు కృష్ణా జలాలు అందుబాటులో ఉన్నప్పటికీ.. ఊహించని విధంగా విస్తరించిన మహానగర జనాభా అవసరాలకు అవి ఏమాత్రం సరిపోవడం లేదు. ఎల్‌నినో సృష్టిస్తున్న ఈ కరవు వలయంలో నగర ప్రజలకు నీటి ఇక్కట్లు తప్పేలా లేవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు**

నల్గొండ: 37.5 డిగ్రీలు, ఖమ్మం: 37.0 డిగ్రీలు, హైదరాబాద్: 37.0 డిగ్రీలు, మెదక్: 34.5 డిగ్రీలు. వాతావరణ నిపుణుల అంచనా ప్రకారం రాష్ట్రంలో వాతావరణ పరిస్థితుల్లో ఎలాంటి మార్పు ఉండబోదని, మరో పది రోజుల పాటు ఇదే తరహా పొడి వాతావరణం, తీవ్రమైన ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పటి నుంచే స్పందించి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సుప్రీం కోర్టు సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

**సంగారెడ్డి, జులై 13, సిరిన్యూస్:**

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు చంద్రబాబు కి గురుప్రదక్షిణ చెల్లించుకునేందుకే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. గోదావరి, నల్లమల కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, కావాలనే లోపాలతో కూడిన కేసును వేయడం వల్లే ఈ కేసు నిలువదని ఉన్నత న్యాయమూర్తులు చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు చూపించుకోవడానికి కేవలం బ్యాక్ డేట్ ఉత్తరాలు రాసిందని ఎద్దేవా చేశారు. గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్‌ఎస్ మొత్తుకుంటూనే ఉందని హరీష్‌రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కు అయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలి? 'నువ్వు కొట్టినట్టు చెయ్.. నేను తిట్టినట్టు చేస్తా' అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్, ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువ అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. గోదావరి నల్లమల సాగర్‌పై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 11 డిసెంబర్ 2025 నాడే పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 16 డిసెంబర్ 2025న రిట్ పిటిషన్ వేసిందని హరీష్ రావు గుర్తుచేశారు. అది డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చేస్తోందని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు రివ్యూలు చేయాల్సిన పాలకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్‌ఎస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో ముగ్గురు సీఎంల అజెండా ఏంటో రేవంత్ రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఎన్‌ఓసీ' పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్ముకుంటున్నారని, దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి చర్చ జరపాలని, దొంగచాటుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందని, అందుకే ఇవాళ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని పేర్కొన్నారు. తమ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టిగా ప్రశ్నించడం వల్లే ప్రభుత్వం దిగివచ్చి దేవాదుల మోటర్లను ఆన్ చేసిందని హరీష్ రావు స్పష్టం చేశారు. అయితే అక్కడ 2500 క్యూసెక్కుల నీటిని ఎత్తాల్సి ఉండగా 6 మోటర్లను మాత్రమే నడుపుతున్నారని విమర్శించారు. సమ్మక్క బ్యారేజీలో నీరు నిల్వ చేసుకుంటే పంపింగ్ చేసుకోవచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాలా ముద్దుగా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. అసలు ఆ సమ్మక్క బ్యారేజీని నిర్మించింది ఎవరో భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని, కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను వాడుకోవడం కూడా చేతకాక కాంగ్రెస్ నేతలు కాలయాపన చేస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు.

**బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు : తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ**

పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశా పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్పై జస్టిస్ విక్రమ్నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్లో కోరగా ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజె క్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖ లు చేసిన పిటిషన్పై సుప్రీంకోర్టులో కీలక మపరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయా లన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒ రిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకా రమే విచారణకు రావాలని స్పష్టం చేసింది. రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్ ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాక ముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే అప్ప టివరకు ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

## ఘనంగా పుల్లూరు బండలో భద్రాచల రామయ్య తలంబ్రాల పంపిణీ



**సిద్దిపేట జులై 13 (సిరి న్యూస్ )**

సిద్దిపేట జిల్లా పుల్లూరు బండ శివాలయంలో సోమవారం భద్రాచల శ్రీరామయ్య కల్యాణానికి సంబంధించిన ముత్యాల తలంబ్రాల పంపిణి కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమాన్ని భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.భక్తులతో భజనలు చేయిస్తూ, పల్లకి సేవతో తలంబ్రాలను దేవాలయం చుట్టూ ఊరేగింపుగా తీసుకెళ్లి అనంతరం భక్తులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ, ఈ సంవత్సరం రామయ్య కళ్యాణానికి 300 కిలోల గోటి తలంబ్రాలు అందించనున్నట్లు తెలిపారు. పుల్లూరు గ్రామం నుండి పెద్ద ఎత్తున గోటి తలంబ్రాలు సేకరించామని అలాగే భద్రాచలం నుండి 100 కిలోల ముత్యాల తలంబ్రాలను భక్తుల కోసం తీసుకువచ్చినట్లు తెలిపారు. తలంబ్రాలు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని భక్తులు తెలిపారు. రామకోటి రామరాజు సేవలను ప్రశంసిస్తూ ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు దేశెట్టి రాజు తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ నగేష్.



**మెదక్ జూలై,13(సిరి న్యూస్)**

ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.అందులో భాగంగా భూభారతి 32, పెన్షన్లు 10, ఇందిరమ్మ ఇండ్లు 12, ఇతర సమస్యలపై 22, మొత్తం దరఖాస్తులు 76 దరఖాస్తులను స్వీకరించామన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి  నిర్వహించే ప్రజావాణిలో ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయంలో భక్తుల కోలాహలం

### ఘనంగా ఆరుద్ర నక్షత్ర చతుర్దశి పూజలు




**వెల్దుర్తి,జులై 13,( సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలం బస్వాపూర్ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం చతుర్దశి పర్వదినం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బసవప్ప ఉదయం గణపతి పూజ నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుట్టు లింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. సోమవారం పర్వదినం సందర్భంగా అనేకమంది భక్తులు అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. అభిషేకం అనంతరం స్వామి వారిని పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆరుద్ర నక్షత్రం చతుర్దశి పర్వదినం కావడంతో వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి!

**అమీన్పూర్ జులై 13 సిరి న్యూస్**




అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని ఆనంద్ నగర్ కాలనీ సమీపంలోని ప్రణీత్ పనోరమ హోమ్స్ ఎదురుగా ఉన్న కల్వర్టు కింద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం, స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల ఎంట్రీ, సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ఎండి రియాజ్ (35) వృత్తి కూరగాయల విక్రేత, నివాసం ఆనంద్ నగర్ కాలనీ, స్వగ్రామం ఎర్రగడ్డ బాలనగర్ గా గుర్తించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేదు

- **జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు**

**మెదక్ జూలై,13(సిరి న్యూస్)**




ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, పారదర్శకంగా విచారణ నిర్వహించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు, సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి ఒక్కో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ,భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను సమర్పించారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, ప్రతి వినతిదారునికి వారి ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని ఎస్పీ పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం,ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం మెదక్ జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి భయం లేదా సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# నిడమానూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా బాలకోటి రెడ్డి

- **మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం**

**నల్గొండ జులై13: సిరిన్యూస్**

నల్గొండ జిల్లా నిడమానూరు మండల ప్రెస్ క్లబ్ ఎన్నికలుసోమవారం జరిగాయి. ఈ సమావేశంలో సభ్యులు ప్రెస్ క్లబ్ ఆఫ్ నిడమనూరు మండల కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కున్ రెడ్డి బాలకోటి రెడ్డి (తొలిసాక్షి), గౌరవ అధ్యక్షుడుగా ఒక్కంటి అరుణ్ కుమార్ (ఈనాడు),ప్రధాన కార్యదర్శిగా బత్తుల సూరయ్య నాయుడు(వార్త), ఉపాధ్యక్షుడుగా ఉమ్మడి వెంకట్ రెడ్డి(సాక్ష్యం), కోశాధికారిగా జువ్వి రాజు(మన తెలంగాణ), సహాయ కార్యదర్శిగా చీదల్ల నరహరి(సాక్షి), కార్యవర్గ సభ్యులుగా మొగిలి రవి (విశాల తెలంగాణ), అన్నెబోయిన కొండల్ ( నేటి దర్శిని), కంచర్ల రవీందర్ రెడ్డి(ద సౌత్ ఇండియా టైమ్స్), బొజ్జ రవి(క్యాపిటల్ ఇన్ఫర్మేషన్), జే. సాయి (ప్రజాజ్యోతి) లను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు సహకరించి మిత్రులకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.ప్రభుత్వానికి – ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు వ్యవహరించాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మీడియా ద్వారా వెలుగులోకి తెచ్చి, ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేయాల్సి ఉంటుంది. ప్రజలకు ప్రభుత్వానికి మీడియా వారధిగా వ్యవహరించాలి. మీడియా మిత్రుల సమస్యలను పరిష్కరించుకోవడానికి యూనియన్ కృషి చేస్తుందని ప్రెస్ క్లబ్ ఆఫ్ నిడమనూరు ( టీయూడబ్ల్యుజే– ఐజేయు) మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కున్ రెడ్డి బాలకోటి రెడ్డి, బత్తుల సూరయ్య నాయుడు తెలిపారు.



# అంతర్జాతీయ ఐసీటీ సదస్సులో గీతం అధ్యాపకురాలి ప్రతిభ..

- **గోవాలో జరిగిన సదస్సులో ఐఓటీపై ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ ప్రసంగం..**

**పటాన్చెరు, జూలై 13 (సిరి న్యూస్):**




హైదరాబాద్లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఏఐ–ఎంఎల్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ గోవాలో నిర్వహించిన 11వ అంతర్జాతీయ ఐసీటీ సదస్సులో గీతం తరఫున ఆహ్వానిత వక్తగా పాల్గొన్నారు. ఈ విషయాన్ని సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో విశ్వవిద్యాలయం వెల్లడించింది.గోవాలోని తాజ్ వివాంటాలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన సదస్సులో ప్రొఫెసర్ పర్వేకర్ "స్మార్ట్, అనుసంధానిత, సుస్థిర పరిష్కారాల అభివృద్ధిలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పాత్ర" అనే అంశంపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. సాంకేతిక ఆవిష్కరణల ద్వారా వాస్తవ ప్రపంచ సవాళ్లను అధిగమించడంలో ఐఓటీ ప్రాధాన్యతను ఆమె వివరించారు.మూడు రోజుల పాటు సాగిన ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, విధాన రూపకర్తలు, ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొని అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, పరిశోధన, ఆవిష్కరణలు, విద్యా–పరిశ్రమ భాగస్వామ్యాలపై చర్చించారు.ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ ఆహ్వానిత వక్తగా పాల్గొనడం గీతం విశ్వవిద్యాలయం పరిశోధన, ఆవిష్కరణలు, అంతర్జాతీయ విద్యా వేదికల్లో పోషిస్తున్న కీలక పాత్రకు నిదర్శనమని విశ్వవిద్యాలయం పేర్కొంది.

# భారతి నగర్ సమస్యలపై కమిషనర్కు సింధు ఆదర్శ్ రెడ్డి వినతి

- **పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి**

**రామచంద్రపురం, జూలై 13 (సిరి న్యూస్):**

భారతి నగర్ డివిజన్లో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనను కోరారు. సోమవారం కమిషనర్ కార్యాలయంలో ఆమెను కలిసి డివిజన్లో నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా బీహెచ్ఈఎల్ హాల్ట్ ఎంఎంటీఎస్ స్టేషన్ నుంచి విద్యుత్నగర్ వరకు ప్రతిపాదిత బీటీ రోడ్డు నిర్మాణ పనులు చాలా కాలంగా పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ను విజ్ఞప్తి చేశారు.అదే విధంగా భారతి నగర్ డివిజన్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపర్చాలని కోరారు. పార్కులు, ఖాళీ స్థలాలు, కాలనీల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి పరిశుభ్రత చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.డివిజన్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలని సింధు ఆదర్శ్ రెడ్డి కోరారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **బండారు యాదగిరి..**
- **జిల్లా కమిటీలో ఎన్నికైన పటాన్చెరు జర్నలిస్టులకు ఘన సన్మానం.**

**పటాన్చెరు, జూలై 13 (సిరి న్యూస్):**



టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా నూతన కమిటీలో ఎన్నికైన పటాన్చెరు నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులకు సోమవారం పటాన్చెరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టులు రామారావు, అశ్వక్, రమేష్, రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, మాజీ అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్దుల్ బాసిత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు పర్చ శ్రీనాథ్, జిల్లా సంయుక్త కార్యదర్శులు కే. శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, ఈసీ సభ్యులు సయ్యద్ మజీద్ అలీ, మైకోటి శ్రీనివాస్ తదితర నూతన జిల్లా కమిటీ సభ్యులను సీనియర్ జర్నలిస్టులు ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే సంఘం ప్రధాన లక్ష్యమని అన్నారు. అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు తదితర సమస్యలను రాష్ట్ర నాయకత్వం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే జర్నలిస్టులకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను త్వరలో నిర్వహించి వారి సామర్థ్యాలను మరింత పెంపొందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. జర్నలిస్టులంతా సంఘటితంగా ఉండి వృత్తి విలువలను కాపాడాలని పిలుపునిచ్చారు. సన్మానితులైన జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. సభ్యుల సహకారంతో సంగారెడ్డి జిల్లా కమిటీని రాష్ట్రంలోనే ఆదర్శ కమిటీగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సీనియర్ జర్నలిస్టులు రామారావు, అశ్వక్, రమేష్, రాజశేఖర్కు నూతన జిల్లా కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు, సభ్యులు, స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

# స్విచ్ ఆఫ్‌లో సబ్‌స్టేషన్ నంబర్లు

- విద్యుత్ పోతే ప్రజలకు దిక్కెవరు.
- ప్రభుత్వం కేటాయించిన మొబైల్ నంబర్లు పనికిరావంటున్న ప్రజలు
- ఆపరేటర్ల నిర్లక్ష్యం – ఏఈల పర్యవేక్షణ లోపంపై విమర్శలు

**మెదక్ జులై 13 సిరి న్యూస్**

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు ప్రత్యేక మొబైల్ నంబర్లను కేటాయించింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు, లైన్ ట్రిప్పింగ్ జరిగినప్పుడు, ఫ్యూజ్ కాలిపోయినప్పుడు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలు నేరుగా సబ్‌స్టేషన్‌ను సంప్రదించి సమాచారం తెలుసుకునేలా ఈ వ్యవస్థను ఏర్పాటు చేసింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఈ వ్యవస్థ ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని పలుచోట్ల ప్రజలు ఆరోపిస్తున్నారు.అనేక ప్రాంతాల్లో సబ్‌స్టేషన్‌లకు కేటాయించిన అధికారిక మొబైల్ నంబర్లు తరచూ స్విచ్ ఆఫ్ వస్తున్నాయని గ్రామాల ప్రజలు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో సమస్య ఏమిటి, ఎప్పుడు కరెంట్ వస్తుంది, మరమ్మతు పనులు జరుగుతున్నాయా లేదా అనే వివరాలు తెలుసుకోవడానికి ప్రజలు ఫోన్ చేస్తే, చాలాసార్లు నంబర్లు స్విచ్ ఆఫ్ లేదా నాట్ రీచబుల్‌గా వస్తున్నాయని వాపోతున్నారు.ప్రభుత్వం ప్రజల కోసం అధికారిక నంబర్లు కేటాయిస్తే, అవే నంబర్లు అందుబాటులో లేకపోతే వాటి ఉపయోగం ఏమిటి అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ అంతరాయం సమయంలో సరైన సమాచారం అందక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెబుతున్నారు.విద్యుత్ శాఖలో సాంకేతికంగా అనేక మార్పులు వచ్చినప్పటికీ ప్రజలకు అత్యంత అవసరమైన కమ్యూనికేషన్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారిక నంబర్లు అందుబాటులో లేకపోవడంతో చివరకు స్థానిక లైన్‌మన్‌లు లేదా పరిచయం ఉన్న ఉద్యోగుల వ్యక్తిగత ఫోన్ నంబర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు.రైతులు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు, పాడి రైతులు, గ్రామీణ ప్రాంత ప్రజలు విద్యుత్ అంతరాయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సాగు సీజన్‌లో మోటార్లకు విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు రాత్రంతా వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవస్థపై మరో ఆరోపణ కూడా వినిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ ఆపరేటర్లు స్థానికంగా విధులు నివసించడం వల్ల సాయంత్రం సమయంలో సింగిల్ ఫేజ్ సరఫరాను ఆన్ చేసి, అనంతరం సబ్‌స్టేషన్‌ను వదిలి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో రాత్రి సమయంలో ఏదైనా సాంకేతిక లోపం లేదా ఫీడర్ ట్రిప్పింగ్ జరిగినా వెంటనే స్పందించే సిబ్బంది సబ్‌స్టేషన్‌లో ఉండడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఈ కారణంగా చిన్న సమస్యలు కూడా గంటల తరబడి కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు.అదే



విధంగా, కొందరు ఆపరేటర్లు ఒక రోజు డ్యూటీ చేయాల్సిన చోట వరుసగా నాలుగు, ఐదు లేదా ఆరు రోజుల పాటు ఒకేసారి విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం షిఫ్ట్ విధానంలో విధులు నిర్వహించాల్సి ఉండగా, కొన్ని చోట్ల ఆ విధానం సక్రమంగా అమలు కావడం లేదని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోందని సమాచారం. ఈ ఆరోపణలపై శాఖాపరంగా స్పష్టత అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.సబ్‌స్టేషన్‌ల పనితీరును సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాల్సి ఉన్నప్పటికీ, అధికారిక మొబైల్ నంబర్లు పనిచేస్తున్నాయా లేదా, విధుల్లో ఉన్న సిబ్బంది సబ్‌స్టేషన్‌లో అందుబాటులో ఉన్నారా లేదా అనే అంశాలపై తగిన స్థాయిలో పర్యవేక్షణ జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.విద్యుత్ సరఫరా అనేది ప్రజలకు అత్యవసర సేవ. అలాంటి సేవలో సమాచారం అందుబాటులో లేకపోవడం ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తోందని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. కనీసం అధికారిక నంబర్లు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సబ్‌స్టేషన్‌లలో విధులు నిర్వహించే సిబ్బంది షిఫ్ట్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.అలాగే ఉన్నతాధికారులు జిల్లాల వారీగా అన్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అధికారిక మొబైల్ నంబర్ల పనితీరు, విధుల్లో సిబ్బంది హాజరు, షిఫ్ట్ అమలు, ప్రజలకు సమాచారం అందించే విధానాన్ని సమీక్షించాలని కోరుతున్నారు. ఒకవేళ నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కూడా సమర్థవంతంగా పని చేసినప్పుడే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని, విద్యుత్ సరఫరాతో పాటు ప్రజలకు సమయానుకూలంగా సమాచారం అందించడం కూడా శాఖ యొక్క కీలక బాధ్యతేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఆరోగ్య నియమాలు పాటించడం అలవర చుకోవాలి

- జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు...
- పాఠశాలలో విద్యార్థినీలకు ఆల్బేండజోల్ టాబ్లెట్‌ల పంపిణీ...

**జోగిపేట, జూలై13, (సిరి న్యూస్):**



విద్యార్థులు ఆరోగ్య నియమాలను అలవరచుకోవాలని అందోలు–జోగిపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు అన్నారు. సోమవారం డీ వార్మింగ్ డే సందర్భంగా మంత్రి దామోదర్ ఆదేశాల మేరకు జోగిపేట ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థినీలకు వేర్వేరుగా ఆల్బేండజోల్ టాబ్లెట్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిట్టిబాబు విద్యార్థినీలను ఉద్దేశించి ప్రసంగించారు. అమ్మాయిలకు ఏలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా, కడుపులో నూలి పురుగులు, నట్టల పురుగుల నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇందులో భాగంగానే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీలకు ఆల్బేండజోల్ టాబ్లెట్స్‌లను అందజేసినట్లు ఆయన తెలిపారు. మనం ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, మన వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మనచుట్టూ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. మనమే కాకుండా మన చుట్టు ఉండే వారికి సైతం ఆరోగ్య విషయంపై పాటించాల్సిన నియామాలను తెలియజేయడానికి మీరందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. మనతో పాటు మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే మనందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి డాక్టర్ శంకర్ నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ రజీత, లెక్చరర్ విఠల్, పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు హేమలత, అసుపత్రి సిబ్బంది సుజాత, ఆశా వర్కర్ శాంతాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అమీన్పూర్ లో అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ సృజన!

- రోడ్లు డ్రైనేజ్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు

**అమీన్పూర్ జూలై 13 సిరి న్యూస్**

అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ వార్డు పిహెచ్ఈఎల్ మెట్రో కాలనీలో సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన, శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ తో కలిసి పర్యటించారు. సీసీ రోడ్లు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలను వాటి స్థితిగతులను దగ్గరుండి పరిశీలించారు. నాణ్యత పై రాజు లేదు నిర్మాణ పనులు ఎక్కడ నాణ్యత లోపించకూడదు అని ప్రభుత్వ నిబంధనలు ప్రకారమే పనులు జరగాలని కాంట్రాక్టర్లకు అధికారులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం తులసివనం చెరువు కట్ట దగ్గర చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలతో సమావేశం ఏర్పాటై కాలనీ ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ తిరుమలే సునీల్ శివకుమార్ టౌన్ ప్లానింగ్ ఏసీ వి ప్రసాద్ స్థానిక ప్రజాప్రతినిధులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# మహిమ హాస్పిటల్స్ మెగా హెల్త్ క్యాంప్‌కు భారీ స్పందన

- తొలి రోజే 500 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు
- క్యాంప్‌ను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు

**రామచంద్రపురం, జూలై 13 (సిరి న్యూస్):**

మయూరి నగర్, బీరంగూడలోని మహిమ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన ఆరు రోజుల మెగా హెల్త్ క్యాంప్‌కు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. తొలి రోజే 500 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకుని నిపుణులైన వైద్యుల నుంచి వైద్య సలహాలు పొందినట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు.మెగా హెల్త్ క్యాంప్‌ను మాజీ కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్ యాదవ్, కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం వారు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని క్యాంప్ నిర్వహణను అభినందించారు.ఈ సందర్భంగా మహిమ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలి రోజే ప్రజలు విశేషంగా స్పందించడం ఆనందంగా ఉందని, రానున్న రోజుల్లో మరింత మంది ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.క్యాంప్‌లో జనరల్ మెడిసిన్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు క్యాంప్ కొనసాగనున్నందున పటాన్‌చెరు, బీరంగూడ, మయూరి నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సోమశేఖర్ విజ్ఞప్తి చేశారు.






# మత్తులో చిత్తు కావద్దు

**మాదక ద్రావ్యాల వినియోగంతో భవిష్యత్తు అంధకారం.**

**జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి.**



**మెదక్ జూలై,13(సిరి న్యూస్)**

నేటి యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మత్తులో జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి ఆద్వర్యంలో సిద్దార్ధ జూనియర్ కళాశాల, మెదక్ పట్టణం లో మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం భవిష్యత్తును నాశనం చేస్తుందని విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యతను క్రమశిక్షణగా తీర్చి దిద్దుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఎక్సైజ్ అధికారులు సిఐ నాగేశ్వరావు, డీటీఫ్ సి ఐ గోపాల్, మెదక్ ఎస్ ఐ బి మాన్సింగ్ సింగ్, మరియు సిబ్బంది. సందీప్, మదుసూదన్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఆపన్నహస్తంగా సీఎం సహాయనిధి..

- రూ.6.50 లక్షల ఎల్ ఓసీ అందజేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, జూలై 13 (సిరి న్యూస్):**

ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో అండగా నిలుస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.బీరంగూడ ఎన్ఎస్ఎల్ కాలనీకి చెందిన పుష్పలత కుమార్తె ప్రగ్యశ్రీ కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చొరవతో మంజూరైన రూ.6.50 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)ని సోమవారం సాయంత్రం బాధిత కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్హులైన నిరుపేదలకు ఎల్ఓసీలు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పారదర్శకంగా అందజేస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పెన్ పహాడ్ మండల లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూలై 13 (సిరిన్యూస్):**

ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్.ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి , నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి , శాసన మండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్ ల సహకారంతో సూర్యాపేట నియోజకవర్గ ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేయటం జరిగింది.

**పెన్ పహాడ్ మండల లబ్ధిదారుల వివరాలు:**

1) దేశగాని రామకృష్ణ తండ్రి పిచ్చయ్య నివాసం: తంగేళ్ల గూడెం గ్రామం, 2) అబ్బగాని వెంకటయ్య తండ్రి మీణయ్య నివాసం: తంగేళ్ల గూడెం గ్రామం, 3) కడవంచి వెంకటమ్మ భర్త సైదులు నివాసం: దోసపహాడ్ గ్రామాల లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేయటం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, తంగేళ్ల గూడెం గ్రామ సర్పంచ్ పందుల వెంకటేశ్వర్లు గౌడ్ , జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు సంకరమద్ది సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరి హనుమంతరావు కు ఘన సన్మానం.!!

**శివంపేట జులై 13(సిరి న్యూస్ )**

శివంపేట మండల కేంద్రంలోని ఏదుల్లాపూర్ గ్రామ సర్పంచ్ మరియు మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరి హనుమంతరావు పటేల్ ను రాష్ట్ర మున్నూరు కాపు అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు శాల్వాతో ఘనంగా సన్మానించి మెమెంటో తో పాటు సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఇటీవల వేములవాడలో ఘనంగా మున్నూరు కాపు సమావేశం నిర్వహించడం జరిగిందని అట్టి సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరి హనుమంతరావు రాలేనందున మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించడం జరిగిందని అన్నారు. మున్నూరు కాపులు సంఘటితంగా సమైక్యంగా ముందుకు తీసుకుపోవాలని హనుమంతరావు ను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్నూరు కాపు కార్యనిర్వాక కార్యదర్శి ఆకుల సత్యనారాయణ పటేల్, మున్నూరు కాపు మహిళా పరస్పర సహకార సంఘం వైస్ చైర్ పర్సన్, ఎద్దులాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కల్లూరి కీర్తన తదితరులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఆభరణాల కోసం మహిళ హత్య..

- నిందితుడికి జీవిత ఖైదుతో పాటు, రూ.25 వేల జరిమానా.
- ఒంటరి మహిళలనే లక్ష్యంగా చేసుకున్న హంతకుడికి యావజ్జీవ కారాగార శిక్ష.
- దర్యాప్తు అధికారులను,పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

**మెదక్,జూలై,13(సిరి న్యూస్)**

ఒంటరిగా సంచరించే మహిళలను లక్ష్యంగా చేసుకుని ఆభరణాల కోసం దారుణ హత్యకు పాల్పడిన నిందితుడికి




జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, తెలిపారు.ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.నర్సాపూర్ పట్టణానికి వచ్చిన బుజలి అనే మహిళతో కేతావత్ గోపాల్ అనే వ్యక్తి పరిచయం పెంచుకుని నమ్మకం కల్పించాడు.అక్కడి నుంచి నర్సాపూర్ శివారులో ఆటో దిగి సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి మద్యం సేవించాడు.మహిళ మెడలో ఉన్న బంగారు ఆభరణాలపై కన్నేసిన నిందితుడు వాటిని దోచుకోవాలనే ఉద్దేశంతో ఆమెను హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు.నర్సాపూర్ పోలీస్ స్టేషన్ లో అప్పటి ఎస్ఐ లింగం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు మహిళతో కలిసి వెళ్లిన ఆటోను గుర్తించి డ్రైవర్‌ను విచారించగా, అతడు వారిని దించిన ప్రాంతాన్ని చూపించాడు. అక్కడ అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టిన పోలీసులు కుళ్లిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తును వేగవంతం చేశారు.అప్పటి నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుడిని అరెస్టు చేసి పక్కా ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, నిందితుడు కేతావత్ గోపాల్‌పై నేరం రుజువైందని నిర్ధారించి, అతనికి జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కేసు దర్యాప్తులో లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ హరిబాబు గౌడ్ సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా పక్కా ఆధారాలు సేకరించి సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి దర్యాప్తు అధికారి సీఐ జాన్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్, లైజనింగ్ బృందం, దర్యాప్తులో పాల్గొన్న పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# సమస్యలు పరిష్కరించండి కమిషనర్కు తుమ్మల డిమాండ్!

- విలీన డివిజన్లో తిప్పలు' మాజీ చైర్మన్ నిలదీత!
- ఆ పాత ఫైళ్లను చూడండి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన వైనం!

**అమీన్పూర్ జులై 13 సిరి న్యూస్**

అమీన్పూర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిఎంసిలో విలీనమై నూతనంగా ఏర్పడినా బీరంగూడ, అమీన్పూర్ డివిజన్లలో మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి గత మున్సిపల్ కౌన్సిల్లో చేసిన తీర్మానాల పనులను వెంటనే చేపట్టాలని అమీన్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం అమీన్పూర్ పరిధిలో పర్యటించిన సీఎం సి కమిషనర్ సృజనని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి గతంలో మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన డివిజన్లో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను, కనీస వసతులలేమిని మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన దృష్టికి తీసుకెళ్లారు.ఆ పాత ఫైళ్లను చూడండి గత కౌన్సిల్ కాలంలో విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఆమోదించిన పాత ఫైళ్లను తీర్మానాల రికార్డులను కమిషనర్ ముందుకు తెచ్చి వాటి ప్రస్తుత స్థితిని వివరించారు. నిర్లక్ష్యంపై ఫైర్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేసినప్పటికీ పాత తీర్మానాల ప్రకారం జరగాల్సిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిసి రోడ్ల పనులను అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.విలీన డివిజన్లో తిప్పలు గ్రామాలను విలీనం చేసి పన్నులు వసూలు చేస్తున్నారే తప్ప ఆయా ప్రాంతాల్లో నిధులు కేటాయించకపోవడంతో ప్రజలు నరకం చూస్తున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ కు డిమాండ్ పాత ఫైళ్లను వెంటనే క్లియర్ చేసి



విలిన డివిజన్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదిక ప్రారంభించి సమస్యలను పరిష్కరించాలని గట్టిగా డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న ఆయా పనులకు తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం




**సిద్దిపేట జులై 13 (సిరి న్యూస్ )**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆట, పాట, జానపద కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడమే టీపీసీసీ సాంస్కృతిక సేన ప్రధాన లక్ష్యమని ఆ సంఘం సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు కళాప్రసాద్ తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు ఆదేశాల మేరకు జిల్లా కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడిగా కళాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బండకాడి గణేష్, ఉపాధ్యక్షులుగా సోము నరేష్, యాదగిరి, కార్యదర్శిగా కళ్లెం లక్ష్మణ్, కోశాధికారిగా బీమరీ సీరియల్, ప్రచార కార్యదర్శిగా డప్పు ప్రశాంత్, మహిళా కార్యదర్శులుగా పెద్ద మ్యాతరి రజిత, గంధమల్ల శ్యామలలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రజలకు చేరవేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు

# కలెక్టరేట్ వద్ద కలం గళం..

- హామీలు అమలు చేయాలి.. జర్నలిస్టుల గర్జన..
- మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట టీయూడబ్ల్యూజేఎఫ్ ధర్నా..
- అక్రిడేషన్, ఆరోగ్య కార్డులపై డిమాండ్..
- సంక్షేమం లేకుంటే ఉద్యమం ఉధృతం హెచ్చరిక..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 13:**

జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాకపోవడంపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జర్నలిస్టుల



సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మీడియా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్ చేస్తూ సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఫెడరేషన్ ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ జిల్లాలో జరిగిన ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎస్కే సలీమా, గుమ్మడి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యదర్శి బనావత్ రవి నాయక్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు గుర్తింపు కార్డులు వెంటనే అందించాలని, ఆరోగ్య భద్రత కోసం ఆరోగ్య కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టుల పిల్లల విద్యకు సంబంధించిన ఫీజుల్లో రాయితీలు కల్పించడంతో పాటు, ఇళ్ల స్థలాల హామీని అమలు చేయాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న సంక్షేమ పథకాలు కార్యరూపం దాల్చకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఫెడరేషన్ నాయకులు హెచ్చరించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా, నియోజకవర్గ బాధ్యులు, నాయకులు, వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## జర్నలిస్టు సంఘం నేత యాదగిరి ని సన్మానించిన హరీష్ రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్!

### అభినందించిన పలువురు నేతలు

**సంగారెడ్డి: జులై 13 (సిరిన్యూస్)**

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు టియుడబ్ల్యూజే ఐజేయు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన బండారు యాదగిరి బిఆర్ ఎస్ శాసనసభాపక్ష ఉప నేత హరీష్ రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సోమవారం సాయంత్రం శాలువాతో సత్కరించారు. సంగారెడ్డి లోని చింత ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం హరీష్ రావు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే ఐజేయు నూతన కార్యవర్గ ఎన్నిక గురించి జిల్లా మహాసభ గురించి న సమాచారం కొందరు నాయకులు హరీష్ రావుకు తెలిపారు. దీంతో వెంటనే అక్కడనే ఉన్న జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి కి హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి అభినందించారు. రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు భుజం తట్టారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కూడా శాలువాకప్పి బండారు యాదగిరిని సన్మానించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శివకుమార్, టీఎన్జీవో రాష్ట్ర మాజీ నేత రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్రెడ్డి, చింత సాయినాథ్, గోవర్ధన్ నాయక్ , జీవి శ్రీనివాస్షేక్ సాబేర్ ,శ్రీధర్ రెడ్డి, మల్ల గౌడ్, తదితరులు టి యు డబ్ల్యూ జే ఐ జేయు అధ్యక్షుడు బండారు యాదగిరికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.



## ఈశ్వరమ్మ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన శివ చరణ్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలి

- తల్లి స్థాయి ఉన్న ఈశ్వరమ్మ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు.
- కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు కీలకం.
- శ్రీకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూలై 13 (సిరిన్యూస్):**

యాదాద్రి టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ డైరెక్టర్ల ఒకరిగా ఎన్నికైన ఈశ్వరమ్మ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు శివ చరణ్ రెడ్డి నీ కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని శ్రీకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లి సమాన స్థాయి ఉన్న ఈశ్వరమ్మ విచక్షణా






రహితంగా వ్యక్తిగత విమర్శలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఒకరిద్దరు అగ్ర కులాల వ్యక్తుల మూలంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో చులకన అయ్యే అవకాశం ఉందన్నారు. రెడ్డి సామాజిక వర్గం సైతం తలదించుకునేలా శివ చరణ్ రెడ్డి మాట్లాడారని ఆరోపించారు. యాదవులు ఎప్పుడు సమాజంలో సామాజిక న్యాయం పాటించే విధంగా ప్రవర్తిస్తారని ఎక్కడ తక్కువ స్థాయి విమర్శలు చేయలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల పాత్ర కీలక మన్నారు. శివ చరణ్ రెడ్డి వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కుల అహంకారంతో మాట్లాడిన శివశరణ్ రెడ్డి ఈశ్వరమ్మకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మర్యాద సైదులు యాదవ్ ప్రధాన కార్యదర్శి తూము వెంకట యాదవ్ మాజీ పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్ ఉపాధ్యాయుల సంఘం సభ్యులు రాము యాదవ్ మాజీ ఎంపీపీ బడుగుల శ్రీనివాస్ యాదవ్ కోడి లింగయ్య యాదవ్ మేకల శ్రీనివాస్ యాదవ్ గుండెబోయిన రమేష్ యాదవ్ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు బుడియా మల్లేష్ యాదవ్ ఉపాధ్యక్షుడు వేల్పుల లింగయ్య యాదవ్ ప్రధాన కార్యదర్శి బిక్షపతి యాదవ్ వెంకట్ యాదవ్ దాసరి వెంకన్న యాదవ్ బడుగుల సైదులు యాదవ్ వేల్పుల ఆరాల రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

# హెల్పర్ అందుబాటులో లేక ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కిన రైతుకు విద్యుత్ షాక్

### గాంధారిపల్లి ఘటనపై ఆందోళన

**మెదక్ జులై 13 సిరి న్యూస్**

మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని గాంధారిపల్లి గ్రామంలో ఓ రైతు అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.స్థానికుల కథనం ప్రకారం, వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతు పలుమార్లు సంబంధిత విద్యుత్ హెల్పర్‌కు ఫోన్ చేసినప్పటికీ స్పందన లభించలేదని చెబుతున్నారు. విద్యుత్ సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో తెలియక, పంటకు నీరు అందకపోతుందనే ఆందోళనతో రైతు స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి పరిశీలించే ప్రయత్నం చేసినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైన రైతు ట్రాన్స్‌ఫార్మర్‌పై నుంచి కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గ్రామస్తులు ఆయనను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది.గ్రామస్తులు మాట్లాడుతూ, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు సంబంధిత సిబ్బంది ఫోన్లు ఎత్తకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది స్పందించే విధానాన్ని విద్యుత్ శాఖ మరింత బలోపేతం చేయాలని వారు కోరుతున్నారు.విద్యుత్‌కు సంబంధించిన లోపాలు తలెత్తినప్పుడు ప్రజలు, ముఖ్యంగా రైతులు, ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు లేదా విద్యుత్ లైన్లను స్వయంగా తాకరాదని నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి చర్యలు ప్రాణాపాయానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.ఈ ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు పూర్తి వివరాలు సేకరించి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రైతు చికిత్సకు అవసరమైన సహాయం అందించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అత్యవసర ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత సమర్థంగా అమలు చేయాలని కోరుతున్నారు.

# గోంగూర ఘుమఘుమ...

ఈ చల్లని వాతావరణంలో ఘాటుగా, రుచికరంగా తినాలనిపిస్తుంది ఎవరికైనా.. మరి అలాంటి కాంబినేషన్ ఏంటని ఆలోచిస్తున్నారా.. ఇంకేముంది నాన్ వెజ్. కాకపోతే గోంగూరతో కలిపి వండితే ఆ రుచే వేరు.



## గోంగూర ఫిష్

### కావలసినవి

| |
|---|
| గోంగూర ఆకులు - ఒక కట్ట |
| ఉల్లిపాయలు - రెండు |
| టొమాటో - ఒకటి |
| పచ్చిమిర్చి - ఆరు |
| ఉప్పు - సరిపడా |
| పసుపు - పావు టీ స్పూన్ |
| ధనియాల పొడి - అర టీ స్పూన్ |
| చేపలు - పావుకిలో |
| నూనె - నాలుగు టేబుల్ స్పూన్లు |
| ఉల్లిపాయ - ఒకటి |
| వెల్లుల్లి - మూడు |
| కరివేపాకు - కొంచెం |
| మిరపకాయలు - రెండు |
| ఆవాలు - ఒక టీ స్పూన్ |
| మెంతి గింజలు - అర టీ స్పూన్ |
| మిరియాలు - అర టీ స్పూన్ |
| లవంగాలు - అర టీ స్పూన్ |
| దాల్చిన చెక్క – చిన్న ముక్క |
| కారం – పావు టీ స్పూన్ |
| పసుపు – పావు టీ స్పూన్ |
| చింతపండు గుజ్జు – రెండు టీ స్పూన్లు |
| తాజా కొత్తిమీర – అర కప్పు |

- ఆకులను కడిగి, ఇతర పదార్థాలతో పాటు పావు కప్పు నీరు కలుపుతూ ఉడికించాలి.
- చేపను కట్ చేసి ఉప్పు, కారం, పసుపు చల్లి బాగా కలపాలి.
- మిరియాలు, లవంగాలు, దాల్చిన చెక్క పొడి చేయాలి.
- ఒక పాన్ వేడి చేసి నూనె వేసి, తర్వాత ఆవాలు, మెంతులు వేసి,
- తరిగిన వెల్లుల్లి, ఉల్లిపాయ ముక్కలు వేసి కొన్ని నిమిషాలు వేయించాలి. తర్వాత కరివేపాకు, ఎండు మిరపకాయలను వేయాలి.
- ఇప్పుడు చేప ముక్కలను వేసి నెమ్మదిగా వేగించాలి. ఆపై మిరియాల లవంగం పొడి, చింతపండు గుజ్జు వేసి 67 నిమిషాలు మూతపెట్టి మెత్తగా టాసు చేయాలి.
- ఇప్పుడు వేడిని తగ్గించి, సిద్ధం చేసిన గోంగూర ముద్దను చేపల కూరలో వేసి, ఉప్పు వేసి, సన్నగా తరిగిన తాజా కొత్తిమీర వేసి బాగా కలపాలి.



## గోంగూర మటన్



| కూర కోసం.. |
|---|
| నూనె - అరకప్పు |
| మటన్ - అర కిలో |
| గోంగూర ఆకులు - ఒక కప్పు |
| నీరు - ఒక లీటర్ |
| ఉప్పు - సరిపడా |
| కారం - రెండు టీ స్పూన్లు |
| కరివేపాకు - కొంచెం |
| ఉల్లిపాయ - ఒక కప్పు |
| అల్లం వెల్లుల్లి పేస్ట్ - రెండు టేబుల్ స్పూన్లు |
| పసుపు - ఒక టీ స్పూన్ |
| వెల్లుల్లి తురుము - మూడు టేబుల్ స్పూన్లు |

| మసాలా పొడి కోసం.. |
|---|
| ధనియాలు - రెండు టేబుల్ స్పూన్లు |
| జీలకర్ర - ఒక టీ స్పూన్ |
| దాల్చిన చెక్క - ఒకటి |
| లవంగాలు - ఐదు |
| మిరియాలు విత్తనాలు - ఒక టేబుల్ స్పూన్ |
| మిరపకాయలు - ఐదు |
| వెల్లుల్లి రెబ్బలు - పన్నెండు |

పాన్‌లో నూనె వేడి చేసి.. తరిగిన ఉల్లిపాయలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, మటన్, కారం, ఉప్పు, నీరు వేసి మూతపెట్టి మీడియం మంట మీద ఉడికించాలి. అవసరమైతే మరింత నీరు కలపండి. మసాలా పౌడర్ కోసం ఉపయోగించిన అన్ని పదార్థాలను మంచి సువాసన వచ్చే వరకు తక్కువ మంటపై వేగించాలి. చివర్లో వెల్లుల్లి రెబ్బలు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. మటన్ ఉడికిన తర్వాత, మిగిలిన నూనెలో గోంగూర ఆకులు వేసి ఉడికించాలి. ఇప్పుడు తురిమిన వెల్లుల్లి, మసాలా పొడి వేసి మూత పెట్టాలి. నూనె పైకి తేలే వరకు మీడియం మంట మీద ఉడికించాలి. అంతే.. గోంగూర మటన్ రెడీ.

# కూల్ వెదర్ లో వర్కవుట్..

ఈ కూల్ వెదర్‌లో వర్కవుట్ చేయాలంటే బయటికి వెళ్లలేం కాబట్టి బద్ధకించడం సహజం. కానీ వర్కవుట్ చేయడం మిస్ ఐనా కష్టమే కదా.. అందుకే ఇంట్లోనే వర్కవుట్ చేయండి. ఇంట్లో ఎలాంటి వర్కవుట్ చేయడానికి వీలు అవుతుందో తెలుసుకుందామా.





### కార్డియో...

కార్డియో వ్యాయామాలు ఇంట్లోనే చేసుకోవచ్చు. స్పాట్ జాగింగ్, స్విమ్మింగ్, జంపింగ్ జాక్స్, స్కిప్పింగ్, మెట్లు ఎక్కుడం, దిగడం వంటివి చేయొచ్చు.

### స్ట్రెంథ్..

కేలరీలు బర్న్ చేయడంలో స్ట్రెంథ్ ట్రైనింగ్ పనికొస్తుంది. డంబెల్స్ ఉంటే ఇంట్లోనే వర్కౌట్ చేయొచ్చు. లేదా వాటర్ బాటిల్స్‌ని నీటితో నింపి వాటి సాయంతో కూడా ఇంట్లోనే స్ట్రెంథ్ ట్రైనింగ్ చేయొచ్చు. దీనిని చేయడం చేయడం వల్ల 200 కేలరీలు ఖర్చవుతాయి.

### స్కిప్పింగ్..

స్కిప్పింగ్ కూడా బెస్ట్ కార్డియో వర్కౌట్. దీనిని చేయడం వల్ల ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. ఇది హై ఇంపాక్ట్ ఎక్సర్‌సైజ్. దీనిని చేయడం వల్ల ఎముకలు బలంగా మారతాయి. అంతే కాకుండా బరువు, థై ఫ్యాట్ తగ్గుతుంది. హిప్స్ కూడా టోన్ అవుతాయి. ఈ వర్కౌట్‌ని కూడా బయటికి వెళ్ళకుండానే ఇంట్లోనే ఉన్న చోటే చక్కగా స్కిప్పింగ్ చేస్తే చాలు. రోజుకి ఓ గంట స్కిప్పింగ్ చేస్తే మీరు దాదాపు 560 కేలరీలను బర్న్ చేస్తారు.

### యోగా

యోగా కూడా బెస్ట్ ఇండోర్ ఎక్సర్‌సైజ్. దీనిని చేయడం వల్ల శారీరక, మానసిక సమస్యలు దూరమవుతాయి. దీనిని చేయడం వల్ల బెనిఫిట్ ఏంటి మీ బాడీపై మీ అవగాన వస్తుంది. యోగా చేస్తే మీకు ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. దీనిని ఇంట్లోనే హ్యాపీగా చేయొచ్చు. యోగాలో ధ్యానం, ప్రాణాయామ, సూర్యనమస్కారం వంటి కొన్ని యోగాసనాలు చేయడం వల్ల ఫిట్‌గా, హెల్దీగా ఉంటారు.

### తొలి మైనింగ్ ఇంజినీర్

# మన గాయత్రి

అమ్మాయి తలచుకుంటే అన్ని రంగాల్లో నెగ్గుకొస్తుంది. భూమ్మీద కాదు ఆకాశంలోనూ.. ఇప్పుడు భూగర్భంలోనూ.. తనకు చోటుందని నిరూపించింది హైదరాబాద్‌కు చెందిన గాయత్రి.



114 ఏండ్ల టాటా స్టీల్ చరిత్రలో మొట్టమొదటి మైనింగ్ ఇంజినీర్. సాధారణంగా ఇంజినీరింగ్ వాళ్ళను సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను ఎంచుకుంటారు. కానీ, గాయత్రి మాత్రం కొత్తగా ట్రై చేసింది. ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు టాటా స్టీల్‌స్‌లో ఇంటర్న్‌షిప్ చేసింది. అప్పుడే ఆమెకు మైనింగ్ ఎంత కష్టమో తెలిసొచ్చింది. అయినా సరే.. అందులోనే సత్తా చాటాలని అనుకుంది. అలా ఇంజినీరింగ్ పూర్తవగానే టాటా స్టీల్‌స్‌లో అవకాశం వచ్చింది.



'నేను సాధించిన దానికి గర్వపడుతున్నాను. మొదట్లో ఒక్కదాన్నే ఉండేదాన్ని. ఇప్పుడు మరికొంత మంది మహిళా ఇంజనీర్లు జాయిన్ అవుతున్నారు. వాళ్లందరికీ ఆదర్శంగా ఉండటం సంతోషంగా ఉంద'ని చెప్పింది గాయత్రి. ఏదైనా సాధించాలనే తపన ఉంటే కచ్చితంగా సాధిస్తారు అనడానికి గాయత్రి కథే ఆదర్శం.

# టీజీ20 లీగ్ తొలి ఛాంపియన్‌గా హైదరాబాద్ ఈ ఛాంపియన్స్



హైదరాబాద్, జూలై 13 (మనసులో మాట) : తెలంగాణ యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన తొలి టీజీ20 లీగ్‌లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టు చరిత్ర సృష్టించింది. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఈ ఫ్రాంఛైజీ ఫైనల్లో ఖమ్మం ఏసెస్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించి తొలి సీజన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమిష్టి ప్రదర్శనతో హైదరాబాద్ జట్టు ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న హైదరాబాద్ కెప్టెన్ అభిరథ్ రెడ్డి నిర్ణయాన్ని బౌలర్లు సమర్థించారు. యశ్వీర్ గౌడ్ మూడు వికెట్లు పడగొట్టి ఖమ్మం బ్యాటింగ్‌ను దెబ్బతీయగా, దేవ్ మెహతా రెండు, అజయ్‌దేవ్ గౌడ్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టారు. ఒక దశలో 33 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన ఖమ్మం జట్టును మికిల్ జైస్వాల్ 65 పరుగులతో ఆదుకున్నాడు. హిమతేజతో కలిసి 94 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పినా, చివరి ఓవర్లలో హైదరాబాద్ బౌలర్లు మళ్లీ పుంజుకోవడంతో ఖమ్మం ఏసెస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 157 పరుగులు మాత్రమే చేసింది. 158 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టుకు షణ్ముఖ అశ్విన్ 36, కెప్టెన్ అభిరథ్ రెడ్డి 48 పరుగులతో మంచి పునాది వేశారు. అనంతరం వైష్ణవ్ రెడ్డి 41 పరుగులతో అజేయంగా నిలిచి వేగంగా పరుగులు రాబట్టాడు. ప్రణవ్ వర్మ 19 పరుగులతో అండగా నిలవడంతో హైదరాబాద్ జట్టు 17.3 ఓవర్లలోనే నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని ఖాయం చేసింది. టోర్నీ విజేత హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టుకు రూ.1 కోటి నగదు బహుమతి అందగా, రన్నరప్ ఖమ్మం ఏసెస్‌కు రూ.50 లక్షలు లభించాయి. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విజేతలకు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, డీజీపీ సి.వి. ఆనంద్, లీగ్ బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ, రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, మార్గదర్శి ఎండీ సీహెచ్ శైలజాకిరణ్ తదితరులు పాల్గొన్నారు. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన అభిరథ్ రెడ్డి ఆరెంజ్ క్యాప్‌ను, అత్యధిక వికెట్లు పడగొట్టిన అజయ్‌దేవ్ గౌడ్ పర్పుల్ క్యాప్‌ను సొంతం చేసుకున్నారు.

# వార్ నిర్ణయంతో స్విస్‌కు షాక్

### సెమీస్‌లోకి అర్జెంటీనా



కాన్సాస్ సిటీ, జులై 13 (మనసులో మాట) : ప్రపంచకప్ ఫుట్‌బాల్‌లో సంచలనాత్మక పరిణామం చోటుచేసుకుంది. అర్జెంటీనా-స్విట్జర్లాండ్ మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో వీడియో అసిస్టెంట్ రెఫరీ (వార్) నిర్ణయం తీవ్ర వివాదానికి దారితీసింది. స్విట్జర్లాండ్ స్టార్ ఫార్వర్డ్ బ్రీల్ ఎంబోలో రెండో ఎల్లో కార్డు కారణంగా రెడ్ కార్డు పొంది మైదానం వీడాల్సి రావడంతో స్విస్ జట్టు గెలుపు అవకాశాలు దెబ్బతిన్నాయి. అదనపు సమయంలో రెండు గోల్స్ సాధించిన అర్జెంటీనా 3-1 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. మ్యాచ్ 72వ నిమిషంలో బ్రీల్ ఎంబోలో బంతితో ముందుకు దూసుకెళ్తుండగా అర్జెంటీనా ఆటగాడు లియాండ్రో పరేడెస్ అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఎంబోలో కిందపడటంతో తొలుత పరేడెస్‌కు ఎల్లో కార్డు చూపించిన రెఫరీ, అనంతరం వార్ సాయంతో నిర్ణయాన్ని పునఃసమీక్షించారు. రీప్లేలో ఎంబోలో ఉద్దేశపూర్వకంగానే ఫౌల్ జరిగినట్లు నటించినట్లు తేలడంతో పరేడెస్‌కు ఇచ్చిన ఎల్లో కార్డును రద్దు చేసి, ఎంబోలోకు ఎల్లో కార్డు విధించారు. అది అతనికి రెండో ఎల్లో కార్డు కావడంతో రెడ్ కార్డుగా మారి మైదానం వీడాల్సి వచ్చింది. ప్రపంచకప్ చరిత్రలో ఫౌల్ కోసం నటించిన కారణంగా రెండో ఎల్లో కార్డుతో ఆటగాడు నిష్క్రమించడం రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ చోటుచేసుకోవడం విశేషం. మ్యాచ్ 67వ నిమిషంలో డాన్ న్డోయే గోల్‌తో స్విట్జర్లాండ్ స్కోరును 1-1తో సమం చేసింది. అయితే ఎంబోలో నిష్క్రమించిన తర్వాత పది మంది ఆటగాళ్లతోనే మ్యాచ్ కొనసాగించాల్సి రావడంతో స్విస్ జట్టు రక్షణాత్మక ఆటకు పరిమితమైంది. నిర్ణీత సమయంలో స్కోరు సమంగా ఉండటంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. అదనపు సమయంలో అర్జెంటీనా తరపున జూలియన్ అల్వారెజ్ 112వ నిమిషంలో, లౌటారో మార్టినెజ్ 120వ నిమిషంలో గోల్స్ సాధించి జట్టుకు 3-1 విజయాన్ని అందించారు. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది. మ్యాచ్ అనంతరం స్విట్జర్లాండ్ ప్రధాన కోచ్ మురత్ యాకిన్ వార్ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్క నిర్ణయమే మ్యాచ్ ఫలితాన్ని మార్చేసిందని, ఇలాంటి తీర్పులు ఆమోదయోగ్యం కావని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై ఫుట్‌బాల్ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది.

# టీమిండియా వైఫల్యాలకు కోచ్, కెప్టెన్ కారణం కాదు



ముంబై, జులై 13(మనసులో మాట): ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత జట్టు 0-4 తేడాతో వైట్‌వాష్‌కు గురికావడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతకుముందు ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌ను కూడా 0-2తో కోల్పోయిన నేపథ్యంలో జట్టులో భారీ మార్పులు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ మాత్రం ఈ వైఫల్యాలకు కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లను బాధ్యులను చేయడం సరైన పరిష్కారం కాదని అభిప్రాయపడ్డాడు. భారత క్రికెట్ వ్యవస్థలోని లోపాలే ప్రస్తుత పరిస్థితికి కారణమని మంజ్రేకర్ పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలమైన పిచ్‌లపై ఆటగాళ్లు భారీ పరుగులు చేయడం వల్ల వారి అసలు సామర్థ్యాన్ని అంచనా వేయడం కష్టమవుతోందని వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ గణాంకాలను చూసి సెలక్టర్లు భ్రమపడుతున్నారని, అవి ఆటగాళ్ల ప్రతిభపై ఒక రకంగా 'మేకప్' వేసినట్లుగా మారాయని విశ్లేషించాడు. వాణిజ్య ప్రయోజనాల కోసం బ్యాటర్లకు అనుకూలంగా నిబంధనలు రూపొందించిన వారిపైనే బాధ్యత వేయాలని సూచించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా ప్రదర్శన తీవ్ర నిరాశ కలిగించింది. ఒక మ్యాచ్‌లో కేవలం 76 పరుగులకే ఆలౌట్ కాగా, మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 257 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. పూర్తిస్థాయి కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు ఇది తొలి సిరీస్ కాగా, అతని నాయకత్వంలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ భారత్ విజయాన్ని నమోదు చేయలేకపోయింది. టీ20 ప్రపంచకప్ విజయం అనంతరం ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌతమ్ గంభీర్‌కు ఈ వరుస పరాజయాలు గట్టి ఎదురుదెబ్బగా మారాయి. మరోవైపు ఈ సిరీస్ విజయంతో ఇంగ్లండ్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అధిరోహించగా, భారత్ వెనుకబడింది. ప్రస్తుతం భారత జట్టు ప్రదర్శనపై క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.

# ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు గిల్ నామినేషన్

దుబాయ్, జులై 13(మనసులో మాట) : జూన్ నెలకు గానూ ఐసీసీ ప్రకటించిన పురుషుల 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు నామినేషన్లలో భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చోటు దక్కించుకున్నాడు. జూన్ నెలలో టెస్టు, వన్డే ఫార్మాట్లలో అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్‌తో పాటు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్, న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నాథన్ స్మిత్ కూడా ఈ అవార్డు కోసం పోటీలో ఉన్నారని ఐసీసీ ప్రకటించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన సిరీస్‌లో గిల్ బ్యాట్‌తో చెలరేగాడు. న్యూ చండీగఢ్‌లో జరిగిన ఏకైక టెస్టులో 126 పరుగులు చేసి భారత్ ఇన్నింగ్స్ విజయానికి బాటలు వేశాడు. అనంతరం వన్డే సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనే 238 పరుగులు సాధించి తన అద్భుత ఫామ్‌ను కొనసాగించాడు. తొలి వన్డేలో 66 బంతుల్లో 84 పరుగులు చేసిన గిల్, రెండో వన్డేలో కాళ్ల నొప్పితో బాధపడుతూనే 110 బంతుల్లో 154 పరుగులతో అజేయ శతకం నమోదు చేశాడు. ఈ ప్రదర్శనతో మ్యాచ్‌తో పాటు సిరీస్‌లోనూ అత్యుత్తమ ఆటగాడిగా ఎంపికై, భారత్ 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు, నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్ ఆస్ట్రేలియాపై తన జట్టుకు చారిత్రాత్మక 2-1 వన్డే సిరీస్ విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. అలాగే న్యూజిలాండ్ పేసర్ నాథన్ స్మిత్ ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో 16 వికెట్లు పడగొట్టి జట్టుకు 2-1తో సిరీస్ విజయం అందించాడు. ఈ ముగ్గురిలో జూన్ నెల అత్యుత్తమ ఆటగాడిగా ఎవరు నిలుస్తారో త్వరలో ఐసీసీ ప్రకటించనుంది.





# చెన్నై సూపర్ కింగ్స్‌కు గుడ్‌బై చెప్పిన ఫ్లెమింగ్

### కొత్త కోచ్‌గా హేమంగ్ బదానీ?

న్యూఢిల్లీ, జులై 13 (మనసులో మాట) : ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్‌కు కీలక మార్పులు చోటుచేసుకోనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దాదాపు 18 ఏళ్లుగా జట్టుతో అనుబంధం కొనసాగించిన ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కోచింగ్ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు సమాచారం. దీంతో కొత్త ప్రధాన కోచ్ నియామకంపై చెన్నై యాజమాన్యం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్‌తో ఉన్న చెన్నై ఫ్రాంచైజీ ప్రతినిధులు కోచింగ్ విభాగంలో మార్పులపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్, ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ కోచ్‌గా ఉన్న హేమంగ్ బదానీ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆయనతో ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిగినట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంపై సీఎస్‌కే క్రికెట్ లిమిటెడ్ డైరెక్టర్ రూపా గురునాథ్ స్పందిస్తూ, కోచింగ్ బృందంలో మార్పులపై అంతర్గతంగా చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. స్టీఫెన్ ఫ్లెమింగ్ రెండు దశాబ్దాల పాటు జట్టుకు విశేష సేవలందించి చెన్నై విజయాల్లో కీలక పాత్ర పోషించారని ఆమె కొనియాడారు. స్టీఫెన్ ఫ్లెమింగ్ 2008లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆటగాడిగా చేరి, 2009 నుంచి ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2016, 2017లో చెన్నై జట్టుపై నిషేధం అమల్లో ఉన్న సమయంలో రైజింగ్ పూణే సూపర్‌జెయింట్స్‌కు కోచ్‌గా వ్యవహరించి ఆ జట్టును ఫైనల్‌కు చేర్చారు. ఆయన కోచ్‌గా ఉన్న కాలంలో చెన్నై సూపర్ కింగ్స్ 11 సార్లు ఫైనల్‌కు చేరగా, అందులో 10 సార్లు ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్, ఒకసారి ఛాంపియన్స్ లీగ్ ఫైనల్ ఆడింది. అలాగే ఆరు ప్రధాన టైటిళ్లను సొంతం చేసుకుని లీగ్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం హేమంగ్ బదానీ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపడతారా లేదా అనే విషయంపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# ద్రవిడ్‌కు ఇంగ్లండ్ కోచ్ అవకాశం?

### రేసులో 'ది వాల్' పేరు..

లండన్, జులై 13 (మనసులో మాట) : ఇంగ్లండ్ పురుషుల టెస్ట్ జట్టు ప్రధాన కోచ్ పదవి నుంచి బ్రెండన్ మెక్‌కల్లమ్ తప్పుకోవడంతో ఆ బాధ్యతలను ఎవరు చేపడతారన్న అంశంపై ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత మాజీ ప్రధాన కోచ్, దిగ్గజ బ్యాటర్ రాహుల్ ద్రవిడ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భారత జట్టును విజయవంతంగా నడిపించిన అనుభవం, యువ ఆటగాళ్లను తీర్చిదిద్దడంలో ఆయనకు ఉన్న ప్రత్యేక గుర్తింపు ద్రవిడ్‌ను బలమైన అభ్యర్థిగా నిలబెడుతున్నట్లు తెలుస్తోంది. అయితే పూర్తి స్థాయి కోచింగ్ బాధ్యతలు స్వీకరించేందుకు ద్రవిడ్ అంతగా ఆసక్తి చూపడం లేదని సమాచారం. నిరంతర పర్యటనలు, కుటుంబానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితులు వంటి కారణాల వల్ల ఆయన ఈ అవకాశాన్ని తిరస్కరించే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా, ఈ పదవి కోసం జింబాబ్వే మాజీ దిగ్గజం ఆండీ ఫ్లవర్, ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ రిచర్డ్ డాసన్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌తో కూడా ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ప్రతినిధులు క్రికెట్ వ్యూహాలపై చర్చలు జరిపినట్లు ప్రచారం సాగుతోంది. అయితే ద్రవిడ్ నియామకంపై ఇప్పటివరకు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రస్తుతం వినిపిస్తున్న వార్తలు కేవలం ప్రచారంగానే భావించాల్సి ఉంది. త్వరలోనే కొత్త ప్రధాన కోచ్‌పై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
మంగళవారం
జూలై-14-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 184
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 4

## హత్నూర ఎంపీపీ ఆఫీసులో అక్రమాల పర్వం

- అధికారిక నియామక ప్రక్రియ లేకుండానే యథేచ్ఛగా విధుల నిర్వహణ
- ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర
- గతంలో బిల్లులు, వౌచర్ల తయారీలో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు
- డీపీవో, ఎంపీడీవోల సహకారంతోనే రీజాయినింగ్?
- విచారణ పూర్తయ్యే వరకు విధుల నుండి తొలగించాలని కాసాల గ్రామస్తుల విజ్ఞప్తి

కంప్యూటర్ ఆపరేటర్ నవీన్ కుమార్ వ్యవహారంపై ఫిర్యాదు

రాజీనామా చేసిన తిరిగి విధుల్లోకి ఎలా?

3





- రాష్ట్ర ప్రయోజనాల కంటే బాబుకు గురుదక్షిణే ముఖ్యమా?
- పోలవరం ఇంటర్‌లింకింగ్ విషయంలో దొంగచాటు వ్యవహారం
- తెలంగాణను ఎడారి చేయడమే లక్ష్యంగా సాగుతున్న కుట్ర
- బీఆర్ఎస్ హయాంలోనే దేవాదుల ప్రాజెక్టుకు పూర్వవైభవం
- మాజీ మంత్రి హరీశ్ రావు

4



ఏపీ ప్రాజెక్టులకు పరోక్షంగా సహకరిస్తున్న రేవంత్ సర్కార్

# రేవంత్ రెడ్డి ఉద్యమ ద్రోహి మాత్రమే కాదు..
# జల ద్రోహి కూడా!

- సుప్రీంకోర్టు సాక్షిగా ప్రభుత్వ నిర్లక్ష్యం బట్టబయలు
- తెలంగాణ జల ప్రయోజనాలను చంద్రబాబుకు తాకట్టు పెట్టిన సీఎం
- లోపభూయిష్టమైన సూట్‌తో కేసును ఓడిపోయిన రాష్ట్ర ప్రభుత్వం

సంగారెడ్డి, జూలై 13 (సిరి న్యూస్): సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వేసిన సూట్ డిస్మిస్ కావడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జల ప్రయోజనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాలికి వదిలేశారని, ఆంధ్రప్రదేశ్ అక్రమ ప్రాజెక్టుల విషయంలో చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించుకునేందుకే రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. గోదావరిబనకచర్ల, నల్లమల సాగర్ ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ మొదటి నుంచీ హెచ్చరిస్తున్నా, ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని హరీశ్ రావు విమర్శించారు. తాజాగా ప్రభుత్వం వేసిన సూట్ లోపభూయిష్టంగా ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడమే దీనికి నిదర్శనమని అన్నారు. సూట్ కూడా సరిగా వేయలేకపోయారా? అని సుప్రీంకోర్టు అక్షింతలు వేసిందని గుర్తు చేశారు. అడ్వొకేట్ జనరల్, ప్రభుత్వ న్యాయవాదులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

## సర్కారు భూమి 'సమర్పయామి!

- అధికారుల కళ్ళు మూత..
- కబ్జాదారుల చేతిరాత..
- నకిలీ నంబర్లతో బూదందా!
- ఆ అక్రమ కట్టడాల వైపు అడుగైన పెట్టని అధికారులు!

కాజిపల్లి సర్వే నెం. 181లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు!



గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 181 పరిధిలోని కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి అక్రమార్కుల అస్తగతమవుతోంది. అక్రమ నిర్మాణాలు ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి సరిహద్దులు ఏర్పాటు చేసి తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలకు తెర లేపారు. నకిలీ నెంబర్ల కేటాయింపు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఎలాంటి అనుమతులు లేని అక్రమ కట్టడాలకు కూడా ఇష్టారాజంగా ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారు.

3

— జిన్నారం జులై 13 సిరి న్యూస్

## ఒకే వ్యక్తికి 38 చోట్ల ఓట్లు!

- హత్నూరలో ఓటర్ల జాబితాలో ఘటన.. షాకైన అధికారులు
- బీజేపీ వార్డు సభ్యుడు శ్రీకాంత్ ఫిర్యాదుతో బయటపడిన బాగోతం
- వెంటనే స్పందించి విచారణకు ఆదేశించిన స్థానిక ఎమ్మార్వో

2






# దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

- క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- జిల్లావ్యాప్తంగా 50 వినతులు స్వీకరణ

సంగారెడ్డి, జూలై 13 (సిరి న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు వేగవంతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన అర్జీదారుల సమస్యలను ఓర్పుగా ఆలకించిన కలెక్టర్, ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 50 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు 16, నారాయణఖేడ్ డివిజన్‌కు 4, జహీరాబాద్ డివిజన్‌కు 6, కలెక్టరేట్‌కు 24 దరఖాస్తులు అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీవో, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.








# ఒకే వ్యక్తికి 38 చోట్ల ఓట్లు !

- హత్నూరలో ఓటర్ల జాబితాలో ఘటన.. షాకైన అధికారులు
- బీజేపీ వార్డు సభ్యుడు శ్రీకాంత్ ఫిర్యాదుతో బయటపడిన బాగోతం
- వెంటనే స్పందించి విచారణకు ఆదేశించిన స్థానిక ఎమ్మార్వో

హత్నూర, జూలై 13 (సిరి న్యూస్):

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్వేలో హత్నూర గ్రామానికి సంబంధించి ఒక ఆశ్చర్యకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఒకే వ్యక్తి పేరు మీద గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఏకంగా 38 స్థానాల్లో ఓట్లు నమోదై ఉండటాన్ని అధికారులు గుర్తించారు. ఈ భారీ అవకతవకను గమనించిన హత్నూర గ్రామానికి చెందిన బీజేపీ వార్డు సభ్యుడు మరియు బీఎల్ఏ నిరుడు శ్రీకాంత్, వెంటనే అప్రమత్తమై ఈ విషయాన్ని స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న ఈ అక్రమ నమోదుపై ఆయన ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. స్థానిక ఎమ్మార్వో ఈ ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించారు. ఓటరు జాబితాలో ఒకే వ్యక్తికి 38 చోట్ల ఓట్లు ఎలా నమోదయ్యాయనే అంశంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓట్లను తొలగించి, తప్పులను సరిదిద్దుతామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

# సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక శిక్షణ

- ‘ఎంఆర్ఎం’ ప్రక్రియపై సమగ్ర అవగాహన
- పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు ఒకరోజు శిక్షణ

సంగారెడ్డి, జూలై 13 (సిరి న్యూస్): సైబర్ నేరాల దర్యాప్తులో వేగం పెంచడం మరియు బాధితులకు త్వరితగతిన సహాయం అందించడమే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, గ్రీవెన్స్ రిడ్రెసల్ మాడ్యూల్ ద్వారా ఫిర్యాదుల నమోదును, మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ ద్వారా సైబర్ బాధితులు కోల్పోయిన సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి వారి ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను క్షుణ్ణంగా వివరించారు. సైబర్ నేరాలను అరికట్టడంలో సాంకేతిక పరిజ్ఞానం అత్యంత కీలకమని, ప్రతి సిబ్బంది ఈ పోర్టల్స్‌పై పూర్తి పట్టు సాధించాలని ఆమె సూచించారు. జిల్లా సైబర్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ, భారత సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలోని సమన్వయ పోర్టల్ ద్వారా దేశవ్యాప్త నేరస్థుల వివరాలను ఎలా పసిగట్టవచ్చో వివరించారు. అలాగే, సోషల్ మీడియాలో వచ్చే చట్టవిరుద్ధమైన లింకులు, సందేశాలను సహయోగ్ పోర్టల్ ద్వారా ఎలా తొలగించాలో ప్రాక్టికల్‌గా చూపించారు. ఈ శిక్షణలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజుతో పాటు వివిధ పోలీసు స్టేషన్ల సైబర్ వారియర్లు పాల్గొన్నారు.







# సర్కారు భూమి 'సమర్పయామి!

- అధికారుల కళ్ళు మూత..
- కబ్జాదారుల చేతిరాత..
- నకిలీ నంబర్లతో బూదందా!
- ఆ అక్రమ కట్టడాల వైపు అడుగైన పెట్టని అధికారులు!

## కాజిపల్లి సర్వే నెం. 181లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు!

**జిన్నారం జులై 13 సిరి న్యూస్ : గడ్డపోతారం మున్సిపల్ పరిధి లోని సర్వే నంబర్ 181 పరిధి లోని కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి అక్రమా ర్కుల అస్తగతమవుతోంది. అక్రమ నిర్మాణాలు ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి సరిహద్దులు ఏర్పాటు చేసి తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలకు తెర లేపారు. నకిలీ నెంబర్ల కేటాయింపు ప్రభుత్వ నిబంధన లను తుంగలో తొక్కి ఎలాంటి అనుమతులు లేని అక్రమ కట్టడా లకు కూడా ఇష్టారాజంగా ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారు.**

అధికారుల ఉదాసీ నత కళ్ళముందే అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అధికారులు మాత్రం ఆ ప్రాంతం వైపు కన్నెత్తి కూడా, చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని ఆరోపణలు వస్తున్నాయి. రాత్రికి రాత్రి నిర్మాణాలు నకిలీ నెంబర్ల అండతో రాత్రికి రాత్రి అక్రమ కట్టడాలు వెలుస్తున్న అధి కారులంతా గప్చుప్ గా ఉండడంపై పలు అను మానాలు వ్యక్తమవుతు న్నాయి.

### స్థానిక అధికారుల అండదండలు

స్థానిక అధికారుల అండదండలు భారీగా చేతులు మారిన, మామూళ్ల వల్లే ఈ అక్రమ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ మున్సిపల్ అధికారుల పరస్పరం సమన్వయం చేసుకొని ఈ అక్రమ కట్టడాల వైపు చూడకుండా గప్చుప్ గా ఉండిపోవడం వెనక భారీ స్కెచ్ ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక అధికారులు పూర్తిగా చేతులెత్తే సిన తరుణంలో జిల్లా కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగి అక్రమార్కులపై, కబ్జా దారులపై కఠినంగా కొరడ రులిపించా లని స్థానికులు కోరుతున్నారు.

# హత్నూర ఎంపీపీ ఆఫీసులో అక్రమాల పర్వం

- కంప్యూటర్ ఆపరేటర్ నవీన్ కుమార్ వ్యవహారంపై ఫిర్యాదు
- రాజీనామా చేసినా తిరిగి విధుల్లోకి ఎలా?
- అధికారిక నియామక ప్రక్రియ లేకుండానే యథేచ్ఛగా విధుల నిర్వహణ
- ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర
- గతంలో బిల్లులు, వౌచర్ల తయారీలో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు
- డీపీవో, ఎంపీడీవోల సహకారంతోనే అక్రమ రీజాయినింగ్?
- విచారణ పూర్తయ్యే వరకు విధుల నుండి తొలగించాలని కాసాల గ్రామస్తుల విజ్ఞప్తి






**హత్నూర, జూలై 13 (సిరి న్యూస్):** హత్నూర మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ నవీన్ కుమార్ వ్యవహారశైలిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియామకం నుంచి బిల్లుల నిర్వహణ వరకు ఆయన వ్యవహారంలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతు న్నాయి. నవీన్ కుమార్ గతంలో తన ఉద్యోగానికి రాజీనామా చేయగా, సంబంధిత అధికారులు దానిని ఆమోదించారు. కానీ, ఎటువంటి బహిరంగ నియామక ప్రక్రియ చేపట్టకుండానే ఆయన తిరిగి అదే ఉద్యోగంలో చేరడం పట్ల తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నియామకం వెనుక జిల్లా పంచాయతీ అధికారి, స్థానిక ఎంపీడీవోల ప్రమేయం ఉందనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. వీరి పాత్రపై కూడా విచారణ జరగాలని స్థానికులు కోరుతున్నారు.ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా..ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగుతూనే నవీన్ కుమార్ బహిరంగంగా రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనడం, ఎన్నికల ప్రచారంలో కీలకంగా వ్యవహ రించడం, గత సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడం వంటి ఘటనలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని కాసాల గ్రామానికి చెందిన సుధీర్ కుమార్, అఖిల్, అనిల్, సత్య నారాయణ, స్వామి, దేవేందర్, నర్సింలు, నవీన్, సాయి కుమార్, లక్ష్మణ్, కృష్ణ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, ఆధారాలు బహిరం గంగా ఉన్నప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసు కోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.బిల్లుల నిర్వహణలో అక్రమాలు..కంప్యూటర్ ఆపరేటర్గా పనిచేసిన కాలంలో బిల్లుల తయారీ, ఓచర్ల నిర్వహణలో భారీగా అక్రమాలు జరిగాయని, ముఖ్యంగా జీతాల చెల్లింపుల ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్ప డ్డారని ఆరోపిస్తూ, ఆయన నిర్వహించిన గత ఫైళ్లను సమగ్రంగా ఆడిట్ చేయాలని కోరుతున్నారు. ఈ అక్ర మాలపై జిల్లా స్థాయి స్వతంత్ర విచారణ జరిపి, నిష్పక్ష పాతంగా చర్యలు తీసుకోవాలని, విచారణ పూర్తయ్యే వరకు ఆయనను విధుల్లో నుండి తొలగించాలని బాధ్య తాయుత పౌరులు ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్నారు.



## రేవంత్ రెడ్డి ఉద్యమ ద్రోహి మాత్రమే కాదు..

# జల ద్రోహి కూడా!

### సుప్రీంకోర్టు సాక్షిగా ప్రభుత్వ నిర్లక్ష్యం బట్టబయలు

- తెలంగాణ జల ప్రయోజనాలను చంద్రబాబుకు తాకట్టు పెట్టిన సీఎం
- లోపభూయిష్టమైన సూట్‌తో కేసును ఓడిపోయిన రాష్ట్ర ప్రభుత్వం
- ఏపీ ప్రాజెక్టులకు పరోక్షంగా సహకరిస్తున్న రేవంత్ సర్కార్
- రాష్ట్ర ప్రయోజనాల కంటే బాబుకు గురుదక్షిణే ముఖ్యమా?
- పోలవరం ఇంటర్‌లింకింగ్ విషయంలో దొంగచాటు వ్యవహారం
- తెలంగాణను ఎడారి చేయడమే లక్ష్యంగా సాగుతున్న కుట్ర
- బీఆర్ఎస్ హయాంలోనే దేవాదుల ప్రాజెక్టుకు పూర్వవైభవం
- మాజీ మంత్రి హరీశ్ రావు

సంగారెడ్డి, జూలై 13 (సిరి న్యూస్): సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వేసిన సూట్ డిస్మిస్ కావడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జల ప్రయోజనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాలికి వదిలేశారని, ఆంధ్రప్రదేశ్ అక్రమ ప్రాజెక్టుల విషయంలో చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించుకునేందుకే రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. గోదావరి-బనకచర్ల, నల్లమల సాగర్ ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ మొదటి నుంచీ హెచ్చరిస్తున్నా, ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని హరీశ్ రావు విమర్శించారు. తాజాగా ప్రభుత్వం వేసిన సూట్ లోపభూయిష్టంగా ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడమే దీనికి నిదర్శనమని అన్నారు. సూట్ కూడా సరిగా వేయలేకపోయారా? అని సుప్రీంకోర్టు అక్షింతలు వేసిందని గుర్తు చేశారు. అడ్వొకేట్ జనరల్, ప్రభుత్వ న్యాయవాదులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఆదేశం లేకుండా ఇంత బలహీనమైన సూట్ దాఖలు చేయడం సాధ్యం కాదని, రేవంత్ రెడ్డి కేవలం ఉద్యమ ద్రోహి మాత్రమే కాదు, తెలంగాణ జల ద్రోహి కూడా అని తీవ్రంగా ధ్వజమెత్తారు.

## చంద్రబాబుతో కుమ్మక్కు

ఏపీ ప్రభుత్వం ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా నియమిస్తే, తెలంగాణ ప్రభుత్వం కూడా ఆయనకే అవకాశం ఇవ్వడం వెనుక ఉన్న మర్మం ఏంటని ప్రశ్నించారు. ఆదిత్యనాథ్ దాస్ తెలంగాణకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి అని, ఆయన మాటలు విని రాష్ట్రాన్ని దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. పాలమూరుకు ఎన్‌ఓసీ తెస్తానంటూ రాష్ట్ర నీటి హక్కులను తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. అసలు ప్రాజెక్టుల బేసిన్లపై కనీస అవగాహన లేని ప్రభుత్వం, ఆవేశంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తోందని అన్నారు.



## దేవాదులపై తప్పుదోవ పట్టించే ప్రయత్నం

దేవాదుల ప్రాజెక్టుపై మంత్రి భట్టి విక్రమార్క తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని హరీశ్ రావు స్పష్టం చేశారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వం రీఇంజినీరింగ్ చేసిన తర్వాతే దేవాదుల ద్వారా **3** లక్షల ఎకరాలకు నీరు అందింది. కాంగ్రెస్ హయాంలో కేవలం **46** వేల ఎకరాలకే పరిమితమైంది. బీఆర్ఎస్ నిర్మించిన సమ్మక్క బ్యారేజీ వల్లనే నేడు దేవాదులకు నీరు అందుతోంది' అని ఆయన వివరించారు. కన్నెపల్లి వద్ద నీరు ఉన్నా లిఫ్టింగ్ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, కేవలం బీఆర్ఎస్ నిలదీసిన తర్వాతే మోటార్లు ఆన్ చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఢిల్లీ సమావేశాల వివరాలను, ముగ్గురు సీఎంల సమావేశంలో జరిగిన చర్చలను ప్రజల ముందు ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.